వీక్షణం

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 1
నవంబర్ 1-15, 2003

సమతా పబ్లికేషన్స్ ప్రచురణ

పేజీలు : 24
వెల: రూ.5-00

లోపలి పేజీల్లో...

వార్షిక చందా రూ॥120/-లు

సంపాదకీయం:

ప్రజాస్వామ్యానికి హానికరం, నియంతృత్వం వైపు పురోగమనం

ఎన్నికైన ప్రభుత్వాలు, ఆ ప్రభుత్వాల కింద నడవవలసిన అధికార యంత్రాంగం సమాజంలో నుంచి వికసించే అభిప్రాయాల పట్ల ఏమాత్రం సహిష్ణుత లేకుండా అతి కఠినంగా వ్యవహరించడం నానాటికి పెరిగిపోతుంది. ప్రజాస్వామ్యానికి మౌళిక పునాది అయిన భిన్నాభిప్రాయాన్ని గౌరవించడం అనే లక్షణం ప్రజాస్వామిక ప్రభుత్వాలని చెప్పకొంటున్న వాటిలో క్రమేణా అంతరించిపోతుంది. ఇది తాత్కాలికంగా ఆయా నాయకులకు, వారి అధికారాలకు తోడ్పడుతుందేమో గానీ, వారి మాట చెల్లినట్టు అనిపించేలా చేస్తుందేమో గాని అంతిమంగా ప్రజాస్వామ్యాన్ని హరించివేస్తుంది. అంటే సమాజ జీవనాన్ని కుంటుపరుస్తుంది. ప్రజాస్వామిక భావాలు వెల్లివిరియని వ్యవస్థ ఎన్ని అలంకారాలద్దుకున్నా శవప్రాయమైన వ్యవస్థే అవుతుంది.

అటువంటి స్మశాన ప్రశాంతిని సాధించాలని సమాజం మీద తమ తిరుగులేని అధికారాన్ని కొనసాగించాలని పాలకులు ప్రయత్నిస్తున్నారనడానికి తాజా ఉదాహరణలు ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి బయటపడుతున్నాయి. రాజకీయంగా చైతన్యవంతమైన రాష్ట్రాలుగా ఉన్న రాష్ట్రాల నుంచే ఇటువంటి భిన్నాభిప్రాయాలను సహించని, భిన్నాభిప్రాయాలను ప్రకటించే కుత్తుకలను కత్తిరించే ధోరణి వెలువడుతుండడం అటు పాలకుల వైపు నుంచి ఇటు పాలితుల వైపు నుంచి కూడా రెండు ముఖ్యమైన పరిణామాలకు సూచిక. ఒకటి ప్రజల్లో నుంచి పాలితుల్లో నుంచి ఇంకా ఇంకా ఎక్కువగా భిన్నాభిప్రాయాలు అసంతృప్తి, ఆందోళన, ఉన్న స్థితిని మార్చాలనే తపన వ్యక్తమౌతున్నాయనడానికి ఇది సూచిక. మరోవైపు పాలకుల వైపు నుంచి నిన్నటి దాకా చూపిన గోముఖం కూడా చూపలేని స్థితి, ఇంకా ఇంకా ఎక్కువగా హింస మీద, అణిచివేత మీద ఆధారపడటం, చివరికి మర్యాదపూర్వకమైన ప్రతిపక్ష భావాలను కూడా సహించలేనితనం పెరిగిపోతున్నదనడానికి సూచన.

ఉదాహరణకు తమిళనాడు.నే చూడండి. అంతకుముందు కేరళ న్యాయస్థానం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల మీద ఆందోళనలను నిషేధించగా తమిళనాడులో ప్రభుత్వం మరొక అడుగు ముందుకు వేసి రిటైర్‌మెంట్ ప్రయోజనాలను అర్ధాంతరంగా ఉపసంహరించి అదేమిటని ప్రశ్నించిన వేలాదిమంది ఉద్యోగులను ఉద్యోగాల నుండి తొలగించి వీధుల పాలు చేసింది. అందులో జోక్యం చేసుకొని న్యాయం చెప్పవలసిన అత్యున్నత న్యాయస్థానం సామెత చెప్పినట్లు మరింత అన్యాయానికి పాల్పడి సమ్మెహక్కు న్యాయంపై ప్రశ్నించే హక్కు లేదనేంతవరకు వెళ్లింది. అదే సమయంలో మరొక అడుగు ముందుకు వేసి ఇవాళ హిందు, మురసోలి పాత్రికేయుల అరెస్టు, బెదిరింపుల దాకా సాగింది. తనకు నచ్చని అభిప్రాయాలు వ్యక్తీకరిస్తే ఎవరినైనా సహించేది లేదని చూపించదలచుకున్న జయలలిత ప్రభుత్వం పశుబలంతో పాత్రికేయుల మీద విరుచుకుపడింది. ఇవాళ పత్రికాస్వేచ్ఛ హరించుకు పోయిందని గగ్గోలు పెడుతున్న పాత్రికేయులు రాజకీయవాదులు అసలు భిన్నాభిప్రాయం మీద దాడి జరిగినప్పడల్లా స్పందించి ఉంటే, మాకెందుకులే అని ఇన్నాళ్లు ఉపేక్షించకుండా వుండిఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదు. ఇది ఆయా వ్యక్తులకు సంబంధించిన సమస్యే కాదు. ప్రజాస్వామ్యానికి, భావప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన సమస్య.

ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలోనే జరిగిన సంఘటన ప్రజాస్వామ్య ప్రియులను మరింత కలవరపరుస్తుంది. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు ప్రజలకు అందడం లేదని నిరంతర జాగరుకతే ప్రజాస్వామ్యానికి హామీ అని నమ్మి పౌరహక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న ఒక సంస్థ అధ్యక్షుడి నోరు మూయించడానికి ప్రయత్నించినదెవరో అందరికి తెలుసు. ప్రజలందరి హక్కులను కాపాడుకోవడానికి కంకణం కట్టుకున్న వ్యక్తికి భావప్రకటనా స్వేఛ్ఛ కరువైపోయిందంటే సమాజంలో భిన్నాభిప్రాయం మీద ఎన్ని ఆంక్షలు అమలు అవుతున్నాయో అర్థం అవుతుంది. ఇటువంటి సమాజం పుచ్చిపోయినట్లు లెక్క. లోలోపల పుచ్చిపోతున్న సమాజం మీద పై అలంకారాలు మిరుమిట్లు కొలిపి అభివృద్ధి సాధిస్తున్నాయని, ముందుకుపోతున్నాయని ఎవరైనా భ్రమపడవచ్చు. ఇతరుల్ని భ్రమల్లో ముంచవచ్చు. కాని వాస్తవం మాత్రం ఇది ప్రజాస్వామ్యానికి హానికరం. నియంతృత్వం వైపు పురోగమనం.

9వ ప్రణాళిక అమలు తీరు

(లక్షల్లో)

	వ్యవసాయం	గ్రామీణాభివృద్ధి	నీటిపారుదల	విద్యుత్	పరిశ్రమలు	రవాణా	సామాజిక సేవలు	ఆర్థిక సేవలు	సాధారణ సేవలు	మొత్తం
1	2	3	4	5	6	7	8	9	10	11
1997-98										
1. ఆమోదించిన పెట్టుబడి	12840.00	23000.00	85500.00	91800.00	4244.00	28930.00	92471.00	18360.00	1360.00	358505.00
2. బడ్జెట్ కేటాయింపు	12840.00	25000.00	81000.00	91800.00	5044.00	30930.00	104426.00	28560.00	1360.00	380960.00
3. సవరించిన అంచనా	12840.000	25000.00	81000.00	91800.00	5044.00	30930.00	104426.00	33645.00	1360.00	386045.00
4. వాస్తవ ఖర్చు	19913.27	23150.67	79623.50	58521.17	19395.24	40144.19	100420.23	17307.82	1943.88	360419.97
1998-99										
1. ఆమోదించిన పెట్టుబడి	17077.00	36392.24	100081.00	90168.00	8044.00	43595.90	119454.58	61029.10	2253.18	478095.00
2. బడ్జెట్ కేటాయింపు	17077.00	40392.24	101377.00	92128.00	5044.00	45924.00	121674.58	42025.00	2253.18	467895.00
3. సవరించిన అంచనా	17077.00	40392.24	101377.00	92128.00	5044.00	37095.90	113829.58	58698.10	2253.18	467895.00
4. వాస్తవ ఖర్చు	20495.57	38862.55	93148.85	79745.89	9260.43	53978.18	143191.92	56073.89	2440.09	497197.37
1999-2000										
1. ఆమోదించిన పెట్టుబడి	18127.00	33407.34	131377.00	86831.11	6044.00	79481.95	128921.16	62229.00	2732.54	549151.10
2. బడ్జెట్ కేటాయింపు	17127.00	32679.34	131377.00	86831.11	6044.00	44139.35	169255.06	58133.00	2364.14	547950.00
3. సవరించిన అంచనా	18084.54	33407.34	136247.00	86831.11	6086.46	66230.85	137184.16	61046.00	2732.54	547950.00
4. వాస్తవ ఖర్చు	17433.18	10568.82	107522.84	142547.21	7627.84	46035.13	97151.16	22547.26	1419.37	452852.81
2000-2001										
1. ఆమోదించిన పెట్టుబడి	20274.83	18073.87	156151.43	267101.79	13327.55	144142.53	116335.67	29139.55	6252.78	770800.00
2. బడ్జెట్ కేటాయింపు	18511.24	42400.26	143393.00	260620.00	8971.46	147553.10	155121.32	39992.15	6249.47	822812.33
3. సవరించిన అంచనా	20274.83	18073.87	156151.43	267101.79	13327.55	142606.42	105825.67	39649.55	6252.78	769263.89
4. వాస్తవ ఖర్చు	26271.64	23608.90	130513.26	253381.89	11307.13	117786.39	77275.86	26393.57	5172.89	671711.53
2001-2002										
1. ఆమోదించిన పెట్టుబడి	14755.10	54370.86	162488.57	233064.42	20333.24	140414.02	165937.07	37427.88	9008.84	837800.00
2. బడ్జెట్ కేటాయింపు	17313.34	52173.71	173256.23	233032.00	24791.84	150139.72	192828.47	43853.95	11712.60	899101.86
3. సవరించిన అంచనా	15394.03	51028.07	145596.09	246736.13	16621.94	140682.80	172139.31	33516.67	10225.35	831940.39
4. వాస్తవ ఖర్చు	14134.04	39567.35	112568.26	263941.17	19904.30	130519.12	164588.77	41282.69	10389.10	796894.80

*ఆధారం : వార్షిక ప్రణాళిక **2003-04***

లంచగొండులూ భయపడకండి

అవసరం పడి వసుదేవుడే గాడిద కాళ్ళు పట్టుకొన్నాడట. అలాగే ఇపుడు ఎన్నికల అవసరం పడి లంచగొండితనంపై యుద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏలేరు స్కామ్‌తో ప్రారంభించి లంచగొండితనాన్ని రక్షించి, పెంచి పోషించిన ప్రభుత్వం లంచగొండితనానికి వ్యతిరేకంగా పోరాడబోతుందంటే మీకు నవ్వు రావటం లేదూ? మంత్రివర్గంలో కొంతమంది మంత్రుల మీదే లంచగొండితనం గురించిన ఆరోపణలున్నాయని లోకాయుక్త స్వయంగా పత్రికల వారికి చెప్పారు. బిగ్‌బాస్ ఎవరో తెలియదు కాని ఆయనెవరో మంత్రివర్గంలోనే వున్నారు. అలాంటి మంత్రివర్గం లంచగొండి తనానికి వ్యతిరేకంగా పోరాడడం అంటే దొంగకే తాళం చెవి ఇచ్చినట్లవుతుంది.

ఇంతకూ ఇపుడు చేసిన నిర్ణయం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు కోసం మాత్రమే. ఈ ఉపసంఘం కూర్చోవాలంటే ఈ ఎన్నికల హడావుడిలో సాధ్యం కాదు. ఎన్నికలలో ఓట్లు వేయించుకోవటానికి ఈ ఉపసంఘం ఏర్పాటు నిర్ణయం ఒక పావు మాత్రమే. ఆ అవసరం తీరిన తర్వాత ఉపసంఘానికి గుడ్‌బై. లేదు, ఈ పార్టీయే అధికారంలోకి మళ్ళీ వస్తే, ఆ చట్టాలకు రూపకల్పన చేయాలి. వాటిని న్యాయశాఖ పరిశీలించాలి. బిల్లు రూపంలో శాసనసభకు వస్తే దానిని సభా కమిటీ పరిశీలించాల్సి రావచ్చు. అదయిన తర్వాత మళ్ళా శాసనసభలో చర్చ, ఆమోదం, రాష్ట్రపతి ఆమోదముద్ర, తదనంతరం చట్టం అమలుకు నియమ నిబంధనలు తయారు కావాలి. ఇలాంటి చట్టాన్ని అమలు పరచే బాధ్యత మళ్ళా లంచగొండి అధికారుల చేతుల్లో పడితే చట్టాల్లో కావాలనే చొప్పించే లొసుగులనవకాశంగా తీసుకొని అమలును నీళ్ళు కార్చటం, ఒకవేళ శిక్షించాలని సిఫార్సు చేసినా, ఆ లంచగొండి అధికారికి, ఏ లంచగొండి ప్రజాప్రతినిధో ఒత్తిడి, మొఖమాటం, పార్టీ ప్రయోజనాలు - అదొక హర్డిల్ రేస్‌లా సాగుతుంది. ఇదంతా జరిగేసరికి మళ్ళా ఎన్నికలొచ్చేస్తాయి. లంచగొండులూ, మీరేం బయపడనక్కర్లేదు. విశేషమేమంటే మంత్రిమండలి నిర్ణయం పత్రికల్లో వచ్చిన మరుసటి రోజు పత్రికల్లో ప్రపంచ బ్యాంకు రుణంతో "ప్రాజెక్టును ముంచిన అవినీతి తుఫాన్" ఇంటర్ బోర్డులో "నకిలీ మెమోల విక్రయం", వెలుగు పథకంలో "దరిద్రుల్లో సంపన్నులు", "మార్కుల కుంభకోణంలో 14 మంది", "జూబ్లీ హిల్స్‌లో కబ్జాల భాగోతం - రు.600 కోట్ల స్థలాలు హుష్‌కాకి", "అవినీతి వరదకు ఆ 'గేటు' (అన్నమయ్య ప్రాజెక్టు) గల్లంతు", "ఏసిబికి చిక్కిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు" (కడప జిల్లా), "గిరిజన సంక్షేమ డి.ఇ.ఇ. ఇళ్ళపై ఎ.సి.బి. దాడి" - ఇదీ వరస, ఇదీ జోరు. చట్టాలతో లంచగొండితనాన్ని రూపుమాపుతానంటే నమ్మే వాళ్ళెవరూ లేరు.

* * *

గత సంవత్సరంతో పోలిస్తే మన దేశం నుంచి ఎగుమతులు ప్రోత్సాహకరంగానే కనిపించవచ్చు. కాని విదేశీ వ్యాపారంలో ఎగుమతులు, దిగుమతుల మధ్య సమతౌల్యం సాధించటం అభిలషణీయం. కాకపోతే, మనది వర్ధమాన దేశం కాబట్టి దిగుమతులు కొంచెం ఎక్కువ వుండవచ్చు. కాని 1500 ఉత్పత్తుల మీద పరిమాణాత్మక ఆంక్షలు తొలగించిన నేపథ్యంలో చైనా, కొరియా లాంటి దేశాల నుంచి దిగుమతులు మన మార్కెట్‌ను ముంచేస్తున్న పరిస్థితుల్లో దిగుమతుల పెరుగుదలను విమర్శనాత్మక దృష్టితో పరిశీలించాల్సి వుంది. ఎందుచేతనంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఎగుమతుల కన్నా దిగుమతుల విలువ గత సంవత్సరం మొదటి అర్ధభాగంలో కన్నా 21 శాతం పెరిగింది. కాని అదే సమయంలో ఎగుమతుల విలువ కేవలం పది శాతం మాత్రమే పెరిగాయి. ఫలితంగా ఎగుమతుల కన్నా దిగుమతుల విలువ రెట్టింపు పెరిగింది. (మిలియన్ డాలర్లలో) దిగుమతులు ఇలా పెరగడానికి యంత్రసామాగ్రి దిగుమతుల వల్లనే అని ఆ శాఖ అధికారులు అంటున్నారు. అయితే ఆ యంత్రసామగ్రి మన పరిశ్రమలు విస్తరించడానికా, విదేశీ కంపెనీలు పరిశ్రమలు స్థాపించడానికా, చాకొలేట్లు, శీతల పానీయాల్లాంటి వాటిని తయారు చేసే పరిశ్రమలకా అనే వివరాలు లభించినపుడే ఈ దిగుమతులు వాపా, బలుపా అనేది తెలుస్తుంది.

* * *

ఈ మధ్య ఉక్కు ధరలు పెరిగాయి. నష్టాల బాటన నడుస్తున్న ఉక్కు పరిశ్రమ లాభాల బాటలో పడిందని ఉక్కు పరిశ్రమ సంతోషిస్తుంటే, ఉక్కు ధరలు పెరగటం వల్ల, ఉక్కు ఉత్పత్తుల తయారీ దారులు, తాము చేసే ఎగుమతులు పోటీకి నిలబడలేకపోతున్నాయని గోల చేస్తున్నారు. తక్కువ రూపాయలకే డాలర్ లభించటం, రూపాయి విలువ పెరగటం మంచిదేనని కొందరనుకొంటుంటే ఎగుమతి దారులు లబోదిబోమంటున్నారు. గత కొద్ది వారాలుగా పత్తి ధర పెరిగి రైతులు సంతోషిస్తుంటే, వస్త్రాల మిల్లుల్లో తమ తయారీ ఖర్చు పెరిగిపోతోందని వస్త్రోత్పత్తిదారులు గగ్గోలు పెడుతున్నారు. సరే ప్రతీ సంవత్సరం ప్రభుత్వమే తిండి గింజల ధర పెంచటంతో రైతులు ఫర్వాలేదనుకొంటుంటే, వినిమయదారులు ధరలు పెరుగుతున్నాయని గోల; ప్రభుత్వ చర్య వల్లనే సబ్సిడీ భారం పెరుగుతుంది. అయినా, మన ఆర్థిక పరిస్థితి బాగానే వుందంటారు ఆర్థికమంత్రి. మీరు అంగీకరిస్తారా?

* * *

మన రాష్ట్రపతి గారిక్కూడా ప్రయివేటీకరణ నినాదం మంగళ వాయిద్యంగా వినిపిస్తున్నట్లుంది. తాజాగా గనుల తవ్వకంలో విదేశీ పెట్టుబడులును ఆహ్వానించాలని సెలవిచ్చారు. ఇప్పటివరకూ ప్రధానంగా భూమ్మీద ఆస్తుల సృష్టికి, వ్యాపారానికి విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ వచ్చారు. ఆ మధ్య సముద్రంలో నుంచి చమురు నిల్వలను వెలికి తీయడానికి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారు. ఆకాశయానంలో ఓపెన్ స్కై విధానమంటున్నారు. ఇప్పుడు భూగర్భంలో ఖనిజ నిధుల మీద కూడా విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడానికి ఇంకా ఏ రంగమైనా వుంటే రెండు చేతుల్తో ఆహ్వానించడానికి బి.జె.పి. ప్రభుత్వం సిద్ధంగా వుంది. ఇంకా దేశాన్నేగుండు గుత్తాగా అమ్మకం ఒకటే మిగిలింది.

\- విహారి

రెండు దశాబ్దాల పార్టీకి ఇంత దివాళాకోరుతనమా?

- వి.కొమరయ్య

చేసేది చెప్పదు చెప్పినది చేయదు. అనే ఘన కీర్తి సంపాదించుకున్న చంద్రబాబు నాయుడు రెండు నెలల పాటు కాదు కాదంటూ వచ్చిన ముందస్తు ఎన్నికలను ప్రకటించాడు. ఈ ఎనిమిది సంవత్సరాల్లో అమలు చేసిన ఇతర నిర్ణయాలవలెనే ఇప్పుడు కూడా ఇదేదో తన నిర్ణయం కానట్టు మరెవరివల్లనో ఇటువంటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నట్టు నటిస్తున్నాడు. మామకు మించిన నటుడిగా ఇప్పటికే గుర్తింపు పొందిన చంద్రబాబు తూతూమంత్రంగా సర్వప్రతినిధి సభ జరిపి తన మనసులోని మాటే హాజరైన పదివేల మంది మాటగా ప్రకటించాడు. ఈ ముందస్తు ఎన్నికలకు తీవ్రవాద సమస్య, ప్రతిపక్షాల దుష్ప్రచారం, అభివృద్ధి మూడు మౌళిక పునాదులని తెలుగుదేశం ప్రకటిస్తుంది. ఈ మూడు అంశాల నిబంధనలను అసలు తెలుగుదేశం పార్టీ ఎనిమిది సంవత్సరాలుగా అనుసరించిన అభివృద్ధి వ్యూహాన్ని ముందస్తు ఎన్నికల చట్టబద్ధతను పరిశీలించవలసి ఉంది.

ఏ ప్రభుత్వాన్నైనా ప్రజలు దాని పూర్తి పదవీకాలం కోసం ఎన్నుకుంటారు. భారత పార్లమెంటరీ సంప్రదాయంలోనైతే ఇది 5 సంవత్సరాలు. ఐదు సంవత్సరాలకు గాను పదవి చేపట్టిన ప్రభుత్వం అంతకుముందే పదవీత్యాగం చేసి మళ్లీ ప్రజల తీర్పును కోరాలంటే అందుకు బలమైన, సంతృప్తికరమైన కారణాలుండాలి. ప్రభుత్వం ఏర్పరచిన రాజకీయపక్షానికి మెజారిటీ తగ్గిపోవడమో, చీలికలు రావడమో ఆ పాలకపక్షం ప్రభుత్వాన్ని నడిపే అర్హత కోల్పోవడమో జరిగినప్పుడు మాత్రమే మధ్యంతర ముందస్తు ఎన్నికలు వస్తాయి. కొనసాగుతున్న ప్రభుత్వానికి తనను తాను రద్దు చేసుకొని మళ్లీ ప్రజల తీర్పు కోరుకునే హక్కు లేదని కాదు కాని, భారత చరిత్రలో అటువంటి హక్కుల్ని ప్రభుత్వాలు అతి తక్కువ సందర్భాల్లో మాత్రమే వాడుకున్నాయి. అటువంటి ముంచుకుపోయిన కారణం ఇప్పుడేమి వచ్చిందో నవంబరు 2004లో రద్దు కావలసిన శాసనసభ నవంబరు 2003లోనే ఎందుకు రద్దు చేయవలసి వచ్చిందో తెలుగుదేశం దగ్గర సంతృప్తికరమైన సమాధానం లేదు. పైగా శాసనసభ రద్దును కోరి ముందస్తు ఎన్నికలకు పోవడం అంటే మంత్రివర్గం యదాతథంగా కొనసాగడమే. అంటే ప్రభుత్వాధికారం దుర్వినియోగానికి పూర్తి అవకాశాలు ఉన్నట్లే. స్థానిక పాలన కొనసాగించలేనని ప్రజల తీర్పు కోరవలసిందేనని ప్రభుత్వం అనుకున్నదంటే పాత ప్రజల తీర్పును రద్దుచేసినట్టే. అందులో మంత్రివర్గానికి సంబంధించి ప్రజల తీర్పుని మాత్రం యధాతథంగా ఉంచుకుని శాసనసభ్యులకు సంబంధించినంతవరకు ఆ ప్రజలు తీర్పును రద్దుచేస్తానని అనడం కుతర్కానికి పరాకాష్ఠ. నిజంగా ప్రజల పాత తీర్పుకు కాలంచెల్లి పోయిందని కొత్తగా మళ్లీ ప్రజల తీర్పు కోరవలసిందేనని ప్రభుత్వం అనుకుంటే, తెలుగుదేశం పార్టీ కోరుకున్నట్లు ఏడాది ముందే పదవీత్యాగం చేయడం సాహసోపేతమైన చర్యే అయినట్టయితే మంత్రివర్గాన్ని కూడా రద్దుచేసి రాష్ట్రపతిపాలన కోరాలి. రాష్ట్రపతి పాలన వల్ల ఏదో జరుగుతుందని కాదు. కాని కనీసం ప్రభుత్వం రెండు నాల్కలతో మాట్లాడ్డం లేదని, అది మాట్లాడే మాటల మధ్య పొంతన ఉందని బయటకు అనిపిస్తుంది.

కాని ఇప్పుడున్న స్థితిలో చంద్రబాబునాయుడు దోస్తీ వల్ల కేంద్రప్రభుత్వం ఆయన పట్ల విధేయంగా బాబుకన్నా ఎక్కువ బాబు భక్తి ప్రదర్శిస్తున్నది గనుక రాష్ట్రపతి పాలన అనే వూసే రాకపోవచ్చు.

మరి ఆ నిర్ణయం రాజ్యాంగ బద్ధత ఎట్లా ఉన్నా ఇతరంగానైనా దాని సమర్థనీయత ఉన్నదా? ఎప్పుడైనా ఏ అధికారపక్షమైనా తిరిగి ఎన్నికలకు వెళ్లేటప్పుడు తాను చేసాననుకుంటున్న మంచి పనులను ఏకరువు పెడుతుంది. తాను చేయలేకపోయిన పనులకు కారణాలు చూపి మళ్లీ గెలిస్తే ఆ పనులు పూర్తి చేస్తానని హామీ ఇస్తుంది. తెలుగుదేశం పార్టీ తీర్మానంలో ఇటువంటి సాధారణ రాజకీయ వైఖరి ఏమీలేదు. నక్సలైట్ల మీద, కాంగ్రెసు మీద విరుచుకుపడడం, అవాకులు చెవాకులు రాయడం మినహా తమ ఎనిమిదేళ్ల పాలనలో, ప్రజాజీవనంలో ఏ అభివృద్ధి సాధించబడిందో మాటమాత్రం కూడా లేదు. తాను అభివృద్ధి చేయదలచుకున్నానని, నక్సలైట్లు అడ్డుపడడం వల్ల అది చేయలేకపోయానని అనడం ఇంత శక్తిసంపదలు, బలగం ఉన్న తన కంటే నక్సలైట్లదే పైచేయని ఒప్పుకోవడమే అవుతుంది.

ఇంతకూ తెలుగుదేశం పార్టీ చేయదలచిన అభివృద్ధి ఏమిటి, నక్సలైట్లు అడ్డుపడింది ఎక్కడ? నిజంగా రానున్న ఎన్నికలకు నక్సలైట్ సమస్యను ప్రధానాంశంగా చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్టైతే తాను ఏయే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందో అవి నక్సలైట్ల వల్ల ఎలా భగ్నం అయ్యాయో వాస్తవాలతో, గణాంకాలతో చూపించవలసి ఉంది.

కాని ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వపు ఆర్భాటపు ప్రచారంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నదని, ఎక్కడా కుంటుపడలేదని ఆంధ్రప్రదేశ్ సింగపూర్‌తోనో, మలేషియాతోనో పోటీపడుతున్నదని కనుచూపు మేరలో స్వర్ణాంధ్ర సాధ్యమని గప్పాలు కొట్టుకున్నది ఈ ప్రభుత్వమే. ఈ అభివృద్ధంతా నక్సలైట్ల వల్ల కుంటు పడుతున్నదని ప్రభుత్వానికి ఎప్పుడు జ్ఞానోదయమైంది? ఈ రెండు మాటలు ఒకేసారి నిజం కావడానికి వీల్లేదు. నిన్నటివరకు ఊకదంపుడుగా చెప్పినదైనా

అబద్దమై ఉండాలి; లేదా ఇప్పుడు చెబుతున్నదైనా అబద్దమై ఉండాలి.

నక్సలైట్లు అడ్డుపడ్డారో లేదో, అడ్డుపడగలిగినంత గణనీయమైన శక్తి అవునోకాదో వేరే చర్చగాని నిజంగానే తెలుగుదేశం ప్రభుత్వం 8 సంవత్సరాలుగా ఒక అభివృద్ధి వ్యూహాన్ని అమలుచేసింది. ప్రపంచ బ్యాంకు బహిరంగ రహస్య ఆదేశాలతో సాగిన ఈ అభివృద్ధి వ్యూహంలో రాష్ట్రంలో ఒక పిడికెడు మంది బడా పెత్తందార్లు, తెలుగుదేశం పార్టీ ఆశ్రితులు, కాంట్రాక్టర్లు, సంపన్నులు లాభపడ్డారు. కోట్లాదిమంది ప్రజానీకం జీవనస్థితిగతులు వాస్తవికంగా దిగజారాయి. నక్సలైట్ల ప్రస్తావన తేకుండానే ఈ అభివృద్ధి వ్యూహం వల్ల ఎవరు లాభపడ్డారో ఎవరు నష్టపోయారో నిగ్గు తేల్చమంటూ మరొకసారి ప్రజల తీర్పు కోరడం అవసరమే. స్వేచ్ఛగా, నిర్భయంగా అటువంటి తీర్పు ప్రకటించే అవకాశం ప్రజలకు దొరికితే అంతకన్నా కావలసింది లేదు. అటువంటి పరిస్థితే వస్తే అన్ని ప్రజా వర్గాలలోనూ తన పట్ల, తన పాలనా విధానాల పట్ల వున్న తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమైతున్నదనీ, తనకిక నూకలు చెల్లవని చంద్రబాబు నాయుడుకు తెలుసు. ఇంటలిజెన్సు నివేదికలు ఆ విషయం స్పష్టం చేస్తున్నాయి. అందుకు నిన్నటిదాకా అభివృద్ధి మంత్ర జపం చేసినవాడల్లా ఇవాళ హఠాత్తుగా ప్లేటు మార్చి నక్సలైట్ పాత్రను ప్రవేశపెడుతున్నాడు.

రెండుపేజీల రాజకీయ తీర్మానంలో అభివృద్ధి అన్న మాట రెండు మూడు సార్లుంటే నక్సలైట్ల గూర్చిన ప్రస్తావన ముప్పై, నలభై సార్లు ఉంది. నక్సలైట్లకు సిద్ధాంతాలు లేవని, వాళ్లతో చర్చలు జరపవలసినంత ప్రజాప్రయోజనకర డిమాండ్లేవి వాళ్లకు లేవని, ప్రజాస్వామ్యానికి తెలుగుదేశం కట్టుబడి ఉందని, నక్సలైట్లు దాన్ని పాడిచేస్తున్నారని ఈ రాజకీయ తీర్మానం ప్రకటించింది. ఈ రాజకీయ తీర్మానం రాసిన వాళ్లకు ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర పట్ల ఉన్న అజ్ఞానం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఇప్పటికి ఒక సిద్ధాంతం వెలుగులో ఆచరణ సాగిస్తున్న వాళ్లుగా నక్సలైట్లను అందరూ గుర్తిస్తున్నారు. వాళ్ల రచనలు చదివినా వాళ్ల ఆచరణ చూసినా అది అర్థం అవుతుంది. మరోవంక ప్రణాళికలో లౌకిక వాదానికి కట్టుబడతానని రాసుకొని మతోన్మాద పార్టీతో 5సంవత్సరాలుగా పీఠముడి వేసుకొంది తెలుగుదేశం. ఇప్పుడే సిద్ధాంతాలు లేవు. ఏ ఇజాలు లేవు ఉన్నదొక్కటే టూరిజం అని అజ్ఞానంతో కూడిన అసహనాన్ని ప్రదర్శించిన వాడు తెలుగుదేశం పార్టీ నాయకుడు. ఎవరికి సిద్ధాంతాలున్నట్లు? ఎవరికి సిద్ధాంతాలు లేనట్లు ?

2001 మే, జూన్ చర్చల ప్రతిపాదనల సందర్భంలోనైతే నేమి తొంభై అయిదు నుంచి రెండువేల ఒకటిదాకా చర్చల ప్రస్తావన వచ్చినప్పుడల్లా అయితేనేమి, నక్సలైట్లు తమ డిమాండ్లను ప్రకటించారు. ఆ డిమాండ్లలో ప్రధానమైనవి భూసంస్కరణల అమలు, గ్రామాల మీద పోలీసుదాడుల రద్దు, ఎన్‌కౌంటర్లు ఆపివేత. ఇవి ప్రజా ప్రయోజనకర డిమాండ్లు అవునా కాదా? ఈ డిమాండ్లలో కనీసం భూసంస్కరణల అమలు అనే డిమాండైనా ప్రభుత్వం ప్రజాప్రయోజనకర డిమాండుగా గుర్తిస్తుందా లేదా?

నక్సలైట్లకు ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్నదో లేదో చర్చించడానికన్నా ముందు ప్రభుత్వానికి విశ్వాసం ఉన్నదో లేదో బహిరంగంగా పునరాలోచించుకోవాలి. పాత లెక్కలన్నీ వదిలి పెట్టినా చంద్రబాబునాయుడి పాలనాకాలంలోనే దాదాపు రెండువేల మంది ఎన్‌కౌంటర్ల హత్యల్లో చనిపోయారు. రాజ్యాంగం ఇరవై ఒకటో అధికరణం ప్రకారం ఏ పౌరుడి ప్రాణాన్నైనా చట్టబద్ధంగా, చట్టసమ్మతంగా మినహా మరొకరకంగా తీసే అధికారం ప్రభుత్వానికి లేదు. ఈ రెండువేల మంది హతులలో ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం మరణశిక్షకు తగిన నేరాలు చేసినవాళ్లు డజనుమందికి కూడా మించరు. అవికూడా పోలీసులు చేసిన ఆరోపణలే తప్ప న్యాయస్థానం నిగ్గు తేల్చిన నేరాలుకావు. మరి చట్టవ్యతిరేకంగా రెండువేల ప్రాణాలు తీసిన ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక అర్హత ఉందా? వాళ్లు సాయుధంగా ఉన్నారు కాబట్టి వాళ్లమీద ఏ చర్య అయినా తీసుకోవచ్చని వాదనకోసం అనవచ్చు. కానీ రాజ్యాంగం పౌరులలో రెండు రకాల పౌరులను గుర్తించలేదు. కొందరికి ఒక రకమైన హక్కులు, మరికొందరికి మరొక రకమైన హక్కులు ఉంటాయని అనలేదు. చట్టం ముందు అందరూ సమానులే అని ప్రకటించింది.

పోనీ వాదనకోసం అది ఒప్పుకున్నా సాయుధులుగా లేని, శాంతియుతంగా తమ సమస్యలు చెప్పుకుంటున్న తమ సమస్యల మీద ఆందోళన చేస్తున్న ప్రజా సమూహాల మీద ఈ ప్రజాస్వామిక ప్రభుత్వం ఎంత ప్రజాస్వామికంగా ప్రవర్తించింది? సైనిక పాలనలో కూడా లేని విధంగా విద్యార్థి సంఘాల మీద, యువజన సంఘాల మీద, రైతుల సంఘాల మీద నిషేధం విధించింది. చాలా మామూలు డిమాండ్లపైన ప్రభుత్వమే అంగీకరించిన జీతాలు ఇమ్మనో, స్కాలర్‌షిప్పులు ఇమ్మనో, ఉద్యోగాలు చూపించమనో, నష్టపరిహారం ఇమ్మనో అడగడానికి వచ్చిన ప్రజాసమూహాల మీద స్త్రీలని, పిల్లలని, వృద్ధులని, అంగవికలులని కూడా చూడకుండా దారుణమైన నిర్బంధాన్ని ప్రయోగించింది.

కనుక అటు ప్రగతి నిర్ణయంలోనూ, ఇటు ప్రజాస్వామ్యం విషయంలోనూ అత్యంత ప్రజా వ్యతిరేకంగా ప్రవర్తించిన ప్రభుత్వం అవి రెండు తనకు రెండు కళ్ళని నక్సలైట్లు వాటిని పాడిచేస్తున్నారని అనడం హాస్యాస్పదం.

ముందస్తుగానైనా, సరైన సమయానికైనా ప్రజల తీర్పు కోరుతూ ఎన్నికలకు పోవడానికి తెలుగుదేశం పార్టీకి ముఖం చెల్లని స్థితి వుంది. ఏ ఒక్క ప్రజాసమూహాన్ని 'ఇదిగో మీకది చేశాం. కనుక మాకు ఓట్లేయండి' అని అడిగే స్థితి తెలుగుదేశం పార్టీకి లేదు. వాళ్ల వల్ల మేలుపొందినవాళ్లు బహుళజాతి సంస్థలు. వారికి ఇక్కడ ఓటు హక్కులేదు. వాళ్లవల్ల లాభపడిన వాళ్లు సంపన్నవర్గాలు. వాళ్ల ఓట్లు 5% మించవు. తాబేదార్లుగానూ, దళారులుగాను, మధ్యవర్తులుగాను

(తరువాయి 8వ పేజీలో)

ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక స్థితి-ప్రాధాన్యాలు

- కె. రామచంద్ర మూర్తి, ఎడిటర్, ఆంధ్రజ్యోతి

(జన విజ్ఞాన సమితి నవంబరు 2, 2003 న హైదరాబాద్‌లో "ఆంధ్రప్రదేశ్. ఆర్థికస్థితి-ప్రాధాన్యతలు" పై జరిగిన గోష్ఠిలో సమర్పించిన పత్రం.)

విశాలాంధ్ర ఏర్పాటయిన తర్వాత గత అయిదు దశాబ్దాల్లో ఎప్పుడూ లేని విధంగా గత అయిదారేళ్ళ కాలంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రపంచ వ్యాప్తంగా సుపరిచితమైంది. ఆంధ్రప్రదేశ్ గురించి బయటవారితో ప్రస్తావిస్తే భాగ్యశాలి రాష్ట్రం అని ఒక్క ముక్కలో తేల్చేస్తారు. "మోస్ట్ హేపెనింగ్ స్టేట్" అని మెచ్చుకుంటారు. బయటవారు మాత్రమే కాదు. స్థానికంగా కూడా చాలా మంది విద్యావంతుల అభిప్రాయం అదే. దీనికి ప్రధాన కారణం ప్రసారసాధానాలు. ప్రసారసాధానాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఇంత ప్రాధాన్యం ఇవ్వడానికి కారణం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన పాలనకు అనేక ప్రత్యేకతలు వున్నాయి. తెలుగుదేశం పార్టీలో ఆయనకు ఎదురులేదు. అధికార సుస్థిరత గురించి రాజకీయ తిరుగుబాటు గురించి చింత అవసరం లేని స్థితి ఆయనది. ఇలా కలిసివచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని కనీసం 2020 వరకైనా రాష్ట్రాన్ని ఎదురు లేకుండా పాలించాలన్న లక్ష్యం ఆయనది. ఈ లక్ష్యానికి అనుగుణంగానే ప్రణాళికలను రూపొందించుకున్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ఈ ప్రణాళికల ధ్యేయంగా ఆయన చెబుతున్నారు. స్వర్ణాంధ్రదేశాన్ని సాధిస్తానని ప్రకటిస్తున్నారు. నిజంగానే ఆయన ప్రణాళికలతో రాష్ట్రం స్వర్ణాంధ్ర దిశగా సాగుతున్నదా ?

వ్యవసాయం

ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి సంబంధించి ముఖ్యమైన పార్శ్వాలు రెండు. ఒకటి వ్యవసాయం పట్టుగొమ్మగా వున్న గ్రామీణ ఆర్థిక రంగం. రెండు పారిశ్రామిక రంగం. చిరకాలంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఆధార ఆర్థిక వ్యవస్థనే. ఈ వాస్తవాన్ని గుర్తించి గత ప్రభుత్వాలన్నీ అందుకు అనుగుణంగానే అభివృద్ధి పథకాలను అమలు చేశాయి. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత మారింది. మన రాష్ట్ర ప్రగతికి దిక్సూచిగా విదేశీ కన్సల్టెన్సీ సంస్థ మెకన్సీ అండ్ కంపెనీ సాయంతో విజన్ 2020ని ప్రభుత్వం రూపొందించింది. ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణగా ఖ్యాతి రావడానికి కారణమైన వ్యవసాయం నుంచి రాష్ట్రాన్ని దారి మళ్ళించి ఎగుమతి ఆధార ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం ఈ విజన్ స్థూల లక్ష్యం. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలు రాష్ట్రంలో డెబ్బయి శాతం మంది ఉన్నారు. వారికి అదే రంగంలో ఉపాధి సౌకర్యాలను స్థిరపరించేందుకు, ఉత్పాదకతను పెంచేందుకు ప్రయత్నించడం కాకుండా వారి సంఖ్యను 35 శాతానికి తగ్గించాలన్నది విజన్ సంకల్పం. వ్యవసాయం పాత్రను తగ్గించి జిడిపిలో ఎగుమతులు, సర్వీసులు, పారిశ్రామికరంగం వాటాను పెంచాలన్నది ధ్యేయం. దీని వల్ల రాష్ట్రం శరవేగంతో అభివృద్ధి చెందుతుందని ఆధునిక ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతున్నదని నమ్మకం.

ప్రభుత్వం ఆశిస్తున్న లక్ష్యాలు విజన్ వల్ల ఏ మేరకు సిద్ధిస్తాయో తెలియదు. అయితే ఆహారాన్ని, భూమిని, రైతులు సృష్టించే సంపదను స్థానిక ఆర్థిక వ్యవస్థ పరిధి దాటించే పద్ధతికి మాత్రం ప్రభుత్వం కారణభూతం అవుతున్నది. చిన్నకమతాలుగా చీలివున్న వ్యవసాయాన్ని కార్పోరేటీకరించడం. కాంట్రాక్టు ఫార్మింగ్‌ను ప్రోత్సహించడం వంటి పద్ధతుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సమృద్ధికి దోహదం చేయాల్సిన సంపద అంతా విదేశీ సంస్థలు, కొత్తగా అవతరించిన భూస్వామ్య వర్గం చేతుల్లోకి వెళ్ళి పోతుంది. ఇప్పటికే ఉద్యోగాలు లేక, ఉపాధి లేక లక్షలాది మంది ప్రజలు అలమటిస్తున్నారు. వీరికి తోడుగా ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయ రంగం నుంచి కూడా నిర్వాసితులు బయలుదేరితే పరిస్థితి ఏ విధంగా వుంటుందో ఊహించవచ్చు. ఉత్పత్తి ఖర్చులు పెరగడం, సబ్సిడీలు తగ్గడంతో భూమిని నమ్ముకున్న వాడు భుక్తి కరువై భూమిలోకి కుంగిపోతున్నాడు. రైతుల, చేనేత కార్మికుల ఆత్మహత్యలు గ్రామీణ ఆర్థికరంగంలోని విషాదవాస్తవానికి సాక్ష్యాలు. నూటికి 70 శాతం మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగం పరిస్థితి ఇది. 14 ఏళ్ళ పాటు సక్రమంగా పలకరించిన రుతుపవనాలు ఒక్క ఏడాది మొహంచాటేస్తేనే అల్లకల్లోలమయ్యే స్థితి.

డ్వాక్రా

పరిస్థితి తీవ్రత ప్రభుత్వం గుర్తించలేదని కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిపుష్టికోసం ప్రభుత్వం ఎన్నుకున్న మరో మార్గం మైక్రో క్రెడిట్. ఇది అంతర్జాతీయ దృష్టిని కూడా ఆకర్షించింది.రాష్ట్రవ్యాప్తంగా కనీసం 50 లక్షల మంది మహిళలు ఈ మైక్రో క్రెడిట్ కార్యక్రమంలో భాగస్వాములుగా వున్నారని అంచనా. వందలకోట్ల రూపాయలను సమీకరించినట్టుగా ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. బ్యాంకులు, విదేశీ సంస్థలు, ఎన్‌జివోలు ప్రభుత్వ సంస్థలు పోటీ పడి అప్పులిస్తున్నాయి. మహిళల సాధికారతకు మైక్రో క్రెడిట్ దోహదం

చేసినట్టుగా ప్రభుత్వం చెబుతున్నది. డ్వాక్రా బృందాలు శ్రీలంక, మలేసియా వంటి దేశాలకు వెళ్ళి ఎగుమతి ఆర్డర్లు తెచ్చుకున్న ఉదంతాలు వున్నాయి. మొత్తం డ్వాక్రా గ్రూపులలో ఇలాంటి గ్రూప్‌ల సంఖ్య చాలా స్వల్పం. అయినప్పటికీ ఇది మంచి పరిమాణమే. ఈ ఫలితాలను ఎంతమేరకు సంఘటితం చేయగలరన్నదే ప్రశ్న. అంతే కాకుండా మైక్రో క్రెడిట్ వలలో చిక్కి అనేక కుటుంబాలు అప్పులపాల పడుతున్నాయన్న విమర్శ కూడా వుంది. ఈ లెక్కలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పారదర్శకంగా వెల్లడించాలి. డ్వాక్రా బృందాలు స్వయం శక్తితో సాధికారతను సాధించగలిగే స్థితి వున్నప్పుడు వాటిని బహుళ జాతి కంపెనీలకు రూరల్ మార్కెటింగ్ నెట్‌వర్క్‌గా పని చేయడానికి ప్రోత్సహించడం మాత్రం మంచిది కాదు. దీర్ఘకాలంలో అసలు లక్ష్యానికి దూరంగా కేవలం గ్రామీణ మార్కెటింగ్ ఏజెన్సీలుగా ఈ స్వయం సహాయక బృందాలు మిగిలిపోయే అవకాశం ఉంది.

పరిశ్రమలు

ఇక పారిశ్రామికీకరణకు సంబంధించిన ప్రభుత్వ విధానాల్లో స్పష్టత లేదు. పార్కులు ఏర్పాటు చేస్తే పారిశ్రామికీకరణ జరిగిపోతుందనుకోవడం ఎంత భ్రమో మన పాత అనుభవాలే చెబుతున్నాయి. రాష్ట్రంలో 243 పారిశ్రామిక వాడలు కొన ఉపిరితో వున్నాయి. అవి సాధించిన పారిశ్రామిక ప్రగతి ఏ పాటిదో విడిగా చెప్పనక్కరలేదు. రాష్ట్రంలో ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. కొత్తగా భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశాలు లేవు. చిన్న పరిశ్రమలకు ప్రభుత్వ ఆదరణ లేదు. సిఐఐతో ప్రభుత్వం జతకట్టి భాగస్వామ్య సదస్సులతో చేస్తున్న హడావుడి వల్ల వచ్చిన పెట్టుబడుల కంటే రాష్ట్రానికి, ప్రభుత్వానికి లభించిన ప్రచారం ఎక్కువ. గత పన్నెండు సంవత్సరాల్లో వేలాది ప్రతిపాదనలు వచ్చినా అందులో కార్యరూపం దాల్చిన వాటి సంఖ్య పరిమితమే. పైగా రాష్ట్రంలో వున్న భారీ పరిశ్రమలు అన్నీ కూడా మూడు నాలుగు జిల్లాల్లోనే కేంద్రీకృతమయ్యాయి. ఇరుగుపొరుగు రాష్ట్రాలతో పోలిస్తే చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై రాష్ట్రంలో పెట్టుబడులు గణనీయంగా తగ్గాయి. ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. పరిశ్రమల ఏర్పాటుకు కావల్సిన నీరు, విద్యుత్ విషయంలో ప్రభుత్వం ఎన్ని కబుర్లు చెబుతున్నా వాస్తవిక పరిస్థితి ఏమిటో పారిశ్రామికవేత్తలకు బాగా తెలుసు. ఈ స్థితిలో కొత్త పరిశ్రమలను ఏ విధంగా ఆశింగలము ? ప్రోటాన్ కార్ల కంపెనీ కోసం గతంలో మలేసియా చుట్టు తిరిగిన ప్రభుత్వం ఇపుడు ఓక్స్‌వాగన్ ప్రాజెక్టు కోసం జర్మనీ చుట్టూ తిరుగుతున్నది. ప్రతిపాదనలపై ప్రచారంతోనే పరిశ్రమలు వచ్చినంత హడావుడి జరుగుతున్నది. మరోవైపు ప్రభుత్వ రంగంలోని చాలా కంపెనీలు మూతపడటం వల్ల, వీఆర్ఎస్ వల్ల రోడ్డున పడే కార్మికుల సంఖ్య పెరిగింది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

చంద్రబాబు నాయుడు వ్యక్తిగత ఆసక్తి, చొరవ చూపిస్తున్న రెండు ప్రధాన రంగాలు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ రంగాలు. ఐటి రంగంలో ప్రభుత్వ కృషి ఫలితంతో పాటు అంతర్జాతీయ పరిణామాలు కూడా కలిసిరావడం వల్ల జరిగిన అభివృద్ధే ఎక్కువ. అమెరికాలో ఔట్ సోర్సింగ్ పై పెరిగిన ఆసక్తి భారత్‌కు, అందులోనూ ఆంధ్రప్రదేశ్‌కు కలిసివచ్చింది. ఐటి స్వావలంబన, స్వయంసమృద్ధి వున్న రంగం కాదు. అమెరికా లేదా మరో సంపన్నరాజ్యం ఆర్థిక బలంపై ఆధారపడి పురోగమిస్తున్న రంగం. అక్కడ ఏదైనా తేడా వస్తే దెబ్బ ఇక్కడే తగులుతుంది. అంతే కాకుండా ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు కూడా కొందరికి మాత్రమే పరిమితమన్న విషయం గుర్తించాలి. అలాగని ఇప్పటి వరకు సాధించిన పురోగతిని కొట్టిపారేయడానికి వీలులేదు. ఐటిలో రాష్ట్రం సాధిస్తున్న అభివృద్ధి అభినందించదగిందే. దీనివల్ల ఒక తరంలోని అనేక మంది మధ్యతరగతి విద్యావంతులైన యువకులు అనూహ్యంగా పై అంతస్తులకు వెళ్ళిపోయారు. అనేక మంది విదేశాలకు వెళ్ళారు. అంతవరకు నిజమే. అయితే రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో మునిగి పోకుండా కాపాడింది మాత్రం ఐటి కాదనీ, ఆబ్కారీ ఆదాయం అనీ గుర్తించుకోవాలి. బయో టెక్నాలజీకి సంబంధించి కూడా ప్రభుత్వ విధానాలు హస్యాస్పదంగా వున్నాయి. డిగ్రీలో ఒక సబ్జెక్ట్‌గా పెడితే బయోటెక్నాలజిస్టులు తయారై పోతారనుకోవడం అశాస్త్రీయమైన అంచనా.

ప్రభుత్వం చొరవ వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్ ఏర్పడింది. ఆయన తనను తాను ఆంధ్రప్రదేశ్ సిఇవో గా అభివర్ణించుకుంటారు. రాష్ట్రాన్ని కంపెనీ మాదిరిగా లాభాల బాటలో నడపాలన్నది ఆయన తపన. ఈ ధోరణి నచ్చే పారిశ్రామిక వేత్తలు ఆయనకు దగ్గరయ్యారు. సిఐఐ, ఫిక్కీ వంటి సంస్థలతో చెలిమి, బడా పారిశ్రామికవేత్తలతో తన స్నేహాన్ని ఉపయోగించుకుని ఆయన రాష్ట్రానికి ఎంతో సాధించాల్సింది. అనేక పరిశ్రమలు, పెట్టుబడులు తేవలసింది. కానీ అలాంటిదేమీ జరగలేదు. ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల రాజకీయ నాయకులకు, వాణిజ్య వేత్తలకు మున్నెన్నడూ లేని నెక్సస్ ఏర్పడింది. పాలనా రంగంలో, విధానాల్లో స్వలాభాపేక్ష తప్ప ఎరగని వాణిజ్యవేత్తల ప్రమేయం పెరిగింది. సీనియర్ బ్యూరోక్రాట్స్ సైతం కొంతమంది బడా కార్పొరేట్ యజమానుల వద్ద వినయంగా చేతులు కట్టుకునే పరిస్థితి తయారయింది. కార్పొరేట్-పొలిటికల్ నెక్సస్ వల్ల అవినీతి మరింత సాంద్రంగా, తీవ్రంగా తయారయింది. 'ఫర్ ఎనీ థింగ్ అండ్ ఎవ్రీ థింగ్, దేర్ ఈజ్ ఏ ప్రైస్' అని నమ్మే వర్గం చట్టబద్ధతతో సంబంధం లేకుండా తన పనులు తాను సజావుగా చేసుకుపోతున్నది.

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల ధనికులకు పేదలకు మధ్య అంతరం అంతకంతకూ అధికం అవుతున్నది. ప్రపంచ బ్యాంక్ నుంచి ఇతర అంతర్జాతీయ సంస్థల నుంచి వస్తున్న కోట్లాది రూపాయిల సొమ్ము ప్రత్యేక ధనికవర్గాన్ని తయారు చేసింది. ప్రభుత్వ ప్రాధాన్యతలకు వాస్తవంగా రాష్ట్రంలో నెలకొని వున్న పరిస్థితులకు మధ్య ఏ మాత్రం పొంతన లేదు. టెక్నాలజీ ప్రోత్సాహం పేరుతో అనుసరిస్తున్న విధానాల వల్ల డిజిటల్ విభజన

పెచ్చుతున్నది.

పూర్వ ప్రభుత్వాల హయాంలో కన్నా చంద్రబాబు పాలనలో ప్రజల మధ్య ఈ విభజన పెరిగింది. ఉపాధి కల్పనకు సంబంధించి ప్రగతి ఏ మాత్రం లేదు. రెవెన్యూలోటు, ద్రవ్యలోటును ప్రభుత్వం ఏ మాత్రం తగ్గించలేక పోయింది. జీరో బేస్డ్ బడ్జెట్, ఓపెన్ బడ్జెట్ అంటూ రకరకాల గారడి విద్యలు ప్రదర్శించడం మినహా నికరంగా ఆర్థిక రంగం ఆరోగ్యానికి ప్రభుత్వం చేసిందేమీ లేదు. వ్యయం పై ఏ మాత్రం నియంత్రణ లేదు. అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు అప్పులు తెచ్చి చేస్తున్న ఖర్చు దీర్ఘకాలిక మూలధన ఆస్తుల నిర్మాణానికి ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. అదే సమయంలో సామాజిక సంక్షేమ కార్యక్రమాల కింద కూడా వెచ్చించడం లేదు. రాష్ట్ర స్థూల ఆదాయంలో శాతంగా చూస్తే ఈ వ్యయంలో తరుగుదల కన్పిస్తున్నది. ప్రణాళికా సంఘం, రిజర్వ్ బ్యాంక్ వంటి సంస్థల ఆందోళనను అభ్యంతరాలను పట్టించుకోకుండా ఎడాపెడా అప్పులు తెస్తూ వాటిని తీర్చడానికి బడ్జెట్‌లో భారీ మొత్తాలు కేటాయించడం షరా మామూలుగా మారింది. అంతర్గత వనరులను పెంచుకోవడం వృద్ధి రేటును మెరుగుపర్చుకోవడం మౌలిక వసతులపై ఇన్వెస్ట్ చేయడం వంటి చేయాల్సిన పనులను పక్కనబెట్టి ప్రభుత్వం పన్నులు పెంచడంపై దృష్టి సారించింది. లిక్కర్ అమ్మకాల రాబడినీ విద్యుత్, రవాణా ఛార్జీల పెంపునుంచి వచ్చే ఆదాయాన్ని నమ్ముకుంటున్నది. యూజర్ ఛార్జీలు, రైలు చార్జీలు, బస్సు ఛార్జీలు, ఇంటి అద్దెలు పెరిగాయి. విద్య, వైద్యం పెనుభారంగా మారాయి. ఉపాధి అవకాశాలు హరించుకు పోయాయి. వస్తు వినియోగం పెరిగినా అది ఒక వర్గానికే పరిమితమై వుంది.

ధనికులు- పేదల మధ్య అగాధం ఏర్పడుతున్నది. ప్రభుత్వం తక్షణం తన ప్రాధాన్యతలను పునఃసమీక్షించుకొని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి విధానాలను రూపొందిస్తే తప్ప పొంచివున్న పెనుముప్పునుంచి తప్పుకోవడం సాధ్యం కాదు.

అలిపిరి ఘటన తనను పూర్తిగా మార్చి వేసిందని ముఖ్యమంత్రి చెబుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఆర్థిక విధానాలను కూడా మార్చుకుంటే ప్రజలకు మేలు జరుగుతుంది. ○

(5వ పేజీ తరువాయి)

రెండు దశాబ్దాల పార్టీకి ఇంత దివాళాకోరుతనమా?

మోచేతినీళ్లు అందుకున్న వర్గం గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణ ప్రాంతాలలోనూ ఎంతో కొంత వుంది గాని అది గణనీయమైన ఓటు బ్యాంకు కాదు. ఫ్లై ఓవర్లు చూసి, మిరుమిట్ల వెలుగులు చూసి, క్రీడోత్సవాలను చూసి హైదరాబాద్‌లోనో, జిల్లాలో వున్న పట్టణాల్లోనో విశాలమైన రోడ్లను చూసి మురిసిపోయే మధ్యతరగతి వుంది గానీ వాళ్లలో ఎంతమంది పోలింగ్ బూతులకొస్తారో తెలియదు. ఈ స్థితిలో చంద్రబాబుకు మిగిలిన ఆశలు తనమీద దాడిపట్ల తెచ్చుకోగలిగిన సానుభూతి లేదా ఓటర్లను రెచ్చగొట్టే భావావేశాలు లేదా డబ్బు.

ఆ వస్తుందనుకున్న సానుభూతి కూడా రాలేదని నెల రోజుల చేతికట్టు రుజువు చేసింది. గోదావరి పుష్కరాల దగ్గరినుంచి హిందూ భావావేశాలను రెచ్చగొట్టి బి.జె.పి కన్నా ఎక్కువ హైందవ ఉద్ధారకుడిగా తెచ్చుకున్న పేరుతో సెంటిమెంట్ల మీద ఓటుబ్యాంకును పెంచుకోవచ్చని అర్థమైంది. అందుకే నేరుగా అలిపిరి ప్రస్తావన తేకుండా నక్సలైట్ హింస గురించి మాట్లాడడం.

రాజకీయ రంగంలో వినిపిస్తున్న వదంతులను బట్టి చంద్రబాబు నాయుడు స్వయంగా గత ఎన్నికలలో 'ఓటు 500రూపాయలకు పెట్టికొన్నాం. ఈ ఎన్నికలలో వెయ్యి పెట్టవల్సి వస్తుంది' అన్నట్లు తెలుస్తుంది. అనైతిక పద్ధతుల ద్వారా నింపుకొన్న ఆయన పార్టీ ఖజానా నుంచి ఇటువంటి ఖర్చు పెట్టడం అసాధ్యం కాకపోవచ్చు. కాని సిద్ధిపేట మధ్యంతర ఎన్నికల్లో డబ్బులు పంచుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులను ప్రజలే పట్టుకొని కొట్టి పోలీసుల కప్పగించినట్లు డబ్బు పంపిణీకి కూడా ఒక పరిమితి వుంది.

చాలా విచిత్రంగా ఈ రాజకీయ తీర్మానం కాంగ్రెసును విమర్శించడానికి కూడా నక్సలైట్ల ప్రస్తావన తెచ్చింది. తాను నక్సలైట్ల మీద పోరాటం చేస్తుంటే కాంగ్రెసు, ఇతర విపక్షాలు వాళ్లను సమర్థిస్తూ వాళ్లతో చర్చలు జరపమంటున్నాయని రాజకీయ తీర్మానం విరుచుకుపడింది. ఇంతకన్నా చారిత్రక అజ్ఞానం హాస్యాస్పదం మరొకటి లేదు. ఆయా విపక్షాలను విమర్శించదలచుకుంటే వారి రాజకీయ విధానాల మీద, వైఖరుల మీద విమర్శ ఎక్కుపెట్టవచ్చు. తెలుగుదేశం పార్టీ ఎంత దివాళాకోరు పార్టీ అయిపోయిందంటే పార్లమెంటరీ ప్రతిపక్షాలను కూడా నక్సలైట్ల బూచి చూపి బెదిరించదలుచుకుందే తప్ప వారి సిద్ధాంతాల మీద, ఆచరణ మీద వ్యాఖ్యానించదలచుకోలేదు.

జిత్తులమారిగా రాజకీయ చదరంగంలో సాటిలేని ఆటగాడిగా పేరుపొందిన చంద్రబాబునాయుడు ఈ అంశాలన్నీ ఆలోచించే వుంటాడు. ఆయన ముందస్తుకు పోవడం ఎందుకంటే ఇంకొక ఏడాది గడిస్తే పరిస్థితి మరింత దిగజారుతుంది. ఇంకా వాగ్దానాలు నెరవేర్చలేదని ప్రజలు గుర్తించడానికి మరొక ఏడాది సమయం చిక్కుతుంది. ఈలోగా వచ్చే వర్షాకాలం కూడా మొండి చెయ్యి చూపితే ప్రజల అసంతృప్తి, కరవు, ఆర్థికదుస్థితి కలగలిసి ప్రభుత్వ వ్యతిరేక ఆగ్రహజ్వాలలు మిన్నంటుతాయి. ఆ ఆగ్రహజ్వాలలు రగలకముందే తిమ్మిని బమ్మి చేసి మరొకసారి ప్రజలను మోసం చేసి పబ్బం గడుపుకునేందుకే ముందస్తు ఎన్నికలు. నిరంతర జాగరూకతే ప్రజాస్వామ్యానికి మూల్యం అని ప్రజాస్వామ్య వైతాళికులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ఇప్పటికి ఎన్నోసార్లు ప్రదర్శించిన అత్యున్నత రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించి ఆ ప్రజాస్వామ్య మూల్యాన్ని చెల్లిస్తారు. నిరంతర జాగరూకతను ప్రకటిస్తారు. ○

భద్రత చేకూర్చని ఆహార వ్యవస్థ

- వి.హనుమంతరావు

మన ఆర్థిక పరిస్థితి ఓ పరస్పర విరుద్ధాల పుట్ట. దేశం గత దశాబ్దం ఆరంభంలో విదేశీ మారకం నిల్వలు నిండుకొని సంక్షోభంలో పడింది. ఇప్పుడేమో విదేశీ నిల్వలు ఇవాళో రేపో నూరు బిలియన్ల డాలర్లను చేరుకొని, వాటినేం చేయాలో తెలియక జుట్టు పీక్కొంటున్నారు. ఒక పక్క 25 కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖ కింద నివసిస్తూ, పూట పూటకు తిండికోసం వెతుక్కోవాల్సి వస్తుండగా, రెండో పక్క ఆరు కోట్ల టన్నుల తిండి గింజల నిల్వలు పేరుకొని (ఇపుడు తగ్గాయనుకోండి) వాటిని ఎలా వదిలించుకోవాలో తెలియక తలకాయ బద్దలు కొట్టుకొంటున్నారు. ఒకపక్క రుణం దొరక్క రైతాంగం నానా అగచాట్లు పడుతుంటే రెండో.పక్క రండహో ఇళ్ళకు, మోటారు సైకిళ్ళకు వినిమయ విలాస వస్తువులకు రుణాలిస్తాం, తక్కువ వడ్డీకిస్తాం తీసుకొని వెళ్ళండని బాంకులు ఇల్లెక్కి కూస్తున్నాయి. రాష్ట్రంలో గ్రామాల్లో విద్యుచ్ఛక్తి వుండదు, రాజధాని నగరం హైదరాబాద్ విద్యుత్ కాంతుల్లో ధగధగలాడిపోతోంది; స్పోర్ట్స్ పేరుతో ఇప్పుడు మరీనూ. ఇలా ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చు. మచ్చుకు తిండిగింజల సంగతే చూద్దాం.

రాజ్యాంగంలో తిండిగింజల హక్కు ప్రజలకివ్వలేదుకాని బతికే హక్కు వుంది. బతకాలంటే తినాలి. తినాలంటే గింజలు కొనుక్కోవాలి. కొనుక్కోవాలంటే డబ్బు కావాలి. డబ్బు కావాలంటే పని చేసి సంపాదించాలి. కాగా బతికే హక్కులో భాగంగా తిండిగింజల హక్కు కూడా ఇమిడి వుంది.

తిండిగింజలు లభించాలంటే అవి మార్కెట్‌లో లభ్యంకావాలి. లభ్యత ఒక్కటే కాదు; అవి ప్రజలు కొనుక్కొనేందుకు అందుబాటులో వుండే ధరకు లభ్యం కావాలి; ప్రతి గ్రామంలోనూ చేతికందేలా వుండాలి. అంతేకాదు పోషకాహార విలువలను అవసరమైనంత మేరకు అందచేసే తిండిగింజలు, ఇతర ఆహార పదార్థాలు లభించాలి. ఇది ప్రభుత్వ బాధ్యత. ఈ బాధ్యతను నిర్వహించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొంది. స్వతంత్రం వచ్చిన మొదటి రెండు దశాబ్దాల్లో తిండిగింజలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి వుంది. సస్య విప్లవం వచ్చిన తరువాత రానురాను తగ్గుతూ వచ్చి ఎగుమతి చేసే స్థాయికి చేరుకొన్నామని ప్రభుత్వం అంటుంది. పేదలకు తిండిగింజలను అందించే దిశగా దేశమంతటా చవక ధరల దుకాణాలను నడుపుతోంది. మార్కెట్ ధర కన్నా తక్కువగా పేదలకు అందుబాటులోకి తేవడానికి సబ్సిడీ ఇస్తుంది. ఈ మూడు పనులు చేపట్టి ఆహార భద్రత సమస్యను పరిష్కరించానని ప్రభుత్వం చెప్పుకొంటుంది. ఆహార శాస్త్రజ్ఞులు చెప్పినదాని ప్రకారం ప్రతిమనిషి కొన్ని కేలరీల విలువ గల ఆహారం తీసుకోవాలని, అపుడే శరీరానికి కావాల్సిన పోషకాహార విలువలు లభిస్తాయని అంటారు. ఆహార సమస్య పరిష్కారం అయిందా? ఆహార ధాన్యాల ధరలు ప్రజలందరికీ అందుబాటులో వున్నాయా? రోజంతా పని చేయడానికి కావాల్సినంత శక్తినిచ్చే పోషకాహార విలువలు అందుబాటులో వున్నాయా? ఆచరణలో ఏం జరిగింది, జరుగుతున్నదీ చూద్దాం.

చాలా ఆశ్చర్యకరమైన విషయమేమంటే గత అయిదు దశాబ్దాలుగా మన దేశానికో వ్యవసాయ విధాన పత్రం అంటూ లేనే లేదు. పరిశ్రమలు, సైన్సు ఇలా అనేక రంగాలకు విధాన పత్రాలు ప్రకటించడమే కాక, వాటిని మారుతున్న పరిస్థితులకు, టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తాజా పత్రాలు విడుదల చేస్తూ వచ్చారు. కాని ఏ వ్యవసాయమైతే దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా వుంటూ వచ్చిందో ఆ రంగానికి విధాన పత్రం లేకపోవడానికి పరిశ్రమలు ప్రభుత్వాన్ని మొదటి భార్య, వ్యవసాయం రెండవ భార్యగా భావించి వ్యవసాయాన్ని చిన్న చూపు చూడటమే కారణం. వి.పి.సింగ్ ప్రధానిగా వున్న కాలంలో ఒక విధాన పత్రం రూపొందించడానికి ప్రయత్నం ప్రారంభమై, ఇప్పటికి, అదెంత అసమగ్రమైనదైనా, ఓ విధానపత్రం వెలువడింది. కాగా 50 సంవత్సరాల పాటు మన వ్యవసాయం దిక్సూచి లేని ఆ తాత్కాలిక పథకాలు తయారు చేయటంతోనే కాలం గడిచిపోయింది. స్వతంత్రం వచ్చిన తర్వాత మొదటి రెండు దశాబ్దాల్లో దేశాన్నెదుర్కొంటున్న తిండి గింజల కొరత సమస్యను దిగుమతుల ద్వారా పరిష్కరించతలపెట్టిందే కాని ప్రణాళికలో చేర్చిన భూసంస్కరణలను అమలు పరిచే ప్రయత్నం ఆనాడే కాదు

ఈనాటికి కూడా చేయకపోవటం వల్ల తిండిగింజల స్వయం పోషకత్వాన్ని సాధించలేకపోయింది. ప్రజల ఆర్థిక స్థితిని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దలేకపోవడానికి పాలకుల వర్గ స్వభావమే కాక, భూసంస్కరణల బహుముఖ లాభాలను గణనలోకి తీసుకోకపోవడమే. ఉదాహరణకు ఎవరైతే నిజంగా పొలంలో శ్రమించి పంట పండిస్తారో, ఆ వ్యవసాయ కూలీలలో (వీరంతా దళిత వర్గానికి చెందిన వారే) 38 శాతం మందికి కుంటా, సెంటూ భూమి లేనివారు. వారికే భూమి వుండి వుంటే గ్రామ సీమల రూపు రేఖలే మారిపోయి వుండేవి. వారి చేతుల్లోకి కొనుగోలు శక్తి వుండి వుంటే పారిశ్రామిక ఉత్పత్తులకు మంచి గిరాకీ లభించి వుండేది. స్థూల జాతీయాదాయం పెరిగి, అప్పుల కోసం భిక్షాటన చేయాల్సి వుండేది కాదు. ఈ రోజున కోట్లాది టన్నుల తిండి గింజలు గోదాముల్లో మూలుగుతున్నాయంటే, ఎగుమతి చేయగలుగుతున్నామంటే దేశంలో ప్రతి నలుగురిలో ఒకరు కడుపు నిండా తిండితినలేకపోవడం వల్లనే అని గమనించాలి. నేడు గ్రామసీమల్లో భూసంబంధాల్లో మార్పు రాలేదని కాదు. కాని ఇదివరకే హెక్టారు లేదా రెండు హెక్టార్లున్న వారు ఈ మార్పువల్ల లబ్ధి పొందుతున్నారు తప్ప భూమి లేని వారు కాదని గ్రహించాలి. ప్రభుత్వం పంచిపెట్టానని చెబుతున్న భూములు నిస్సారవంతమైనవి, కాగితం మీద మాత్రమే పేదలకు దఖలు జరిగి, భూమి మాత్రం భూకామందు నీడలోనే వుండేది. నీటి సదుపాయం అందుబాటులో లేనేలేదని గ్రామసీమలతో ఏపాటి పరిచయం వున్న వారికైనా తెలిసిన విషయం. ఇక ప్రస్తుతానికి వస్తే ప్రభుత్వ దృష్టిలో మనది మిగులు దేశం. అవును, ఆరుకోట్ల టన్నుల తిండిగింజలు గోదాముల్లో జమ అయ్యాయంటే మిగులు దేశం కాక మరేమిటి ? కాని వాస్తవమేమంటే దేశంలో 21 శాతం మంది ప్రజలు తిండితినక పస్తులుండడం వల్ల ఏర్పడిన మిగుళ్ళివి. చవక ధరల దుకాణాల్లో సబ్సిడీ ఇచ్చి తిండి గింజలు సరఫరా చేసినా, కొనుగోలు శక్తి లేక విడుదల కాకపోవడంతో ఏర్పడిన మిగుళ్ళివి. ఆ చవక దుకాణాల్లో కూడా ప్రజల ఆర్థిక జీవితం మీద ప్రపంచ బ్యాంకు పెత్తనం వచ్చిన తర్వాత, బోగస్ కార్డుల ఏరివేత పేరుతో, నిజంగా నిరుపేదలకే (టార్జెటెడ్ గ్రూప్) ఇస్తామన్న పేరుతో, వారికో ధర నిర్ణయించి, మిగతా వారందరికి అయిదు నుండి ఆరు రూపాయలకు అమ్మాలని నిర్ణయించగా, కొనుక్కోలేకపోవటం వల్లన ఏర్పడిన మిగుళ్ళు. ఈ ఆకలి కడుపుల మీద నిర్మించిన ఈ మిగుళ్ళను చూసి ఇక తిండిగింజల సమస్యే లేదనే విధంగా ప్రభుత్వం ప్రవర్తించటం క్షమించరానిది. తిండిగింజల కొరత కాక మిగుళ్ళే సమస్య కావటంతో, ఈ మిగుళ్ళను నిల్వ చేయటం చాలా ఖర్చుతో కూడుకొన్న విషయం కావటంతో (గత ఆర్థిక సంవత్సరంలో ఈ నిల్వల ఖర్చు కిలోకు రెండు రూపాయలు అంటే మొత్తం 14 వేల కోట్లు!) ఎలాగైనా ఈ నిల్వలు వదిలించుకోవాలని చవక దుకాణాల్లో సరఫరా చేసే కన్నా తక్కువ ధరకే ఎగుమతి చేసి కొంత మేరకు నిల్వలను వదిలించుకొంది. పనికి ఆహారం పథకం పేరుతో రాష్ట్రాలకు బియ్యాన్ని పంపిణీ చేసింది. ఆ పథకం ఎంత సొగసుగా సాగిందో ఇక్కడ వివరించాల్సిన పని లేదనుకొంటా. ఎవరికి చేరాలో వారికి చేరకపోవడం వల్ల ఆకలి సమస్య సమస్యగానే వుండిపోయింది. సరే గత రెండు సంవత్సరాల కరువు సమస్య వల్ల చవకదుకాణాల ద్వారా విడుదల పెరిగింది. ఇలా చేయటంతో నిల్వలు ఎంత తగ్గిపోయాయంటే, కనీసం ఉండాల్సిన స్థాయి కన్నా తక్కువ స్థాయికి పడిపోయాయి. మళ్ళా ఇంకో వర్షాభావ పరిస్థితో, తుపాను పరిస్థితి వస్తే, మళ్ళా దిగుమతుల మీద ఆధారపడాల్సిన స్థితి ఏర్పడుతుంది. జనానికి సబ్సిడీ ఇచ్చి సహాయ పడుతున్నాం అని చెబుతున్న ప్రభుత్వం ఈ సబ్సిడీలను తగ్గించి వ్యాపారస్థులకు సబ్సిడీ, ఎలకల సబ్సిడీ (గోదాముల్లో ఎలుకల పలహారం) మన రాష్ట్రంలో పచ్చచొక్కా వారికి సబ్సిడీ పథకంగా తయారైంది. ఏతావాతా జరిగిందేమంటే ప్రజలకు ఆహార భద్రత అనే సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా అక్కడే వుండిపోయింది.

ఆహార ధాన్యాల నిల్వలు భరించలేనంతగా పెరిగిపోవడానికి కనీస ధరల నిర్ణయం మరొక కారణం. ప్రతి సంవత్సం ప్రతి పంటకు కనీస ధరను వ్యవసాయ ధరల కమిషన్ నిర్ణయిస్తుంది. ఇటీవలి కాలంలో, ఓట్ల సంపాదన దృష్టితో కమీషన్ నిర్ణయించిన ధర కన్నా ఎక్కువ స్థాయిలో ధరలను ప్రభుత్వం నిర్ణయించటం వల్ల, పోలోమంటూ రైతులంతా ప్రభుత్వానికి అమ్మటం జరిగింది. గోదాములు లేకపోతే, ఆరుబయటే తిండిగింజలను నిల్వ చేసింది. సాధారణంగా జరిగేదేమంటే ఎప్పుడైతే తిండిగింజల ధరలు పెరుగుతాయో, మిగతా ధరలన్నీ కూడా పెరుగుతుంటాయి. బోగస్ కార్డుల భాగోతం ఇతర రాష్ట్రాలో ఎలా వుందో తెలియదు కాని మన రాష్ట్రంలో తెలుగుదేశం మిత్రపక్షమైన బి.జె.పి. జాతీయ కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు పి.వేణుగోపాలరెడ్డి ప్రకారం "ఇప్పుడున్న తెల్లకార్డులలో హీనపక్షం 30 శాతం భోగస్ కార్డులని అంచనా. అంటే 35 లక్షల బోగస్

కార్డులున్నాయన్నమాట. వీటివల్ల ఏటా వేయికోట్ల రూపాయలకు పైగా ప్రజాధనం పేదల పేరిట పెద్దలకు చేరుతోంది" ఇది చాలదన్నట్లు ఇపుడు రాబోయే ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని బోగస్ కార్డులకు లాకులెత్తేసారు. ధరఖాస్తు వున్నా సరే, లేకపోయినా సరే, కార్డులు పంచేయమన్నారు. కంచే చేను మేస్తే ఎవరేమి చేయగలరు ? ఈ బోగస్ కార్డుల సృష్టికి రెండు కారణాలు. ఒకటి రేషన్ షాపులో ఇచ్చే బియ్యం చాలక, ఆ చవక ధరకే బియ్యం లభిస్తాయనే ఆశతో పేదలే అలాంటి కార్డుల సృష్టికి తోడ్పడడం, రెండు 'పెద్దల' తోడ్పాటుతో, ప్రోద్బలంతో బోగస్ పేర్లతో కార్డులు సృష్టించి, సొమ్ము చేసుకోవటం. 19వ జన్మభూమిలో రేషన్ కార్డులకు 45 లక్షల దరఖాస్తులు వచ్చాయట!

ఈ బియ్యం క్వాలిటీ ఏమిటో అందరికీ తెలిసిన విషయమే. పేదల ఆహారం పోషక విలువలు లేని ఆహారానికి పెట్టిన మరోపేరు. దేశం మొత్తం మీద చూస్తే రాను రాను పోషకాహార విలువలు తగ్గుతున్నాయని నేషనల్ సాంపుల్ సర్వే గణాంకాలు తెలియచేస్తున్నాయి. ప్రతీ మనిషి 2700 కాలరీల పోహకాహార విలువ గల తిండి తినాలని సర్వే సూత్రీకరించింది. ఈ సూత్రీకరణ ప్రకారం దేశంలో మూడు పెద్ద రాష్ట్రాల్లో తప్ప ఏ ఒక్క రాష్ట్రంలోనూ అంత ఆహారం తినటమే లేదు. దేశంలో కేలరీల విలువ 1987లో 2364 నుంచి 99-00లో 2030కు తగ్గింది. జాతీయ ఆరోగ్య సర్వే ప్రకారం పేద మహిళల్లో 80శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. సగం మంది పిల్లలు పోషకాహార కొరత అనుభవిస్తున్నారు. 1970 నుంచి ధోరణులను పరికిస్తే ఈ విలువలు నానాటికి తీసిపోతున్నాయి. ఈ క్రింది పట్టిక చూడండి.

గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార విలువలు (కేలరీలు)

రాష్ట్రం	1993-94	1999-2000
ఆంధ్రప్రదేశ్	2052	2021
అస్సాం	1983	1915
బీహార్	2115	2121
గుజరాత్	1994	1986
హర్యానా	2491	2455
కర్నాటక	2073	2028
కేరళ	1985	1982
మధ్యప్రదేశ్	2164	2062
మహారాష్ట్ర	1939	2012
ఒరిస్సా	2199	2119
పంజాబ్	2418	2381
రాజస్థాన్	2470	2425
తమిళనాడు	1884	1826
ఉత్తరప్రదేశ్	2307	2327
పశ్చిమబెంగాల్	2211	2095

ఈ అంకెలన్నీ ఆయా రాష్ట్రాల సగటును తెలియచేస్తున్నాయి. ఇంకా లోతుకుపోయి చూస్తే పేదలు తినే కాలరీలు ఇంకా తక్కువగా వుంటాయని వేరే చెప్పాల్సిన పనిలేదు.

తిండి గింజల లభ్యత కూడా ఇదే ధోరణిని తెలియచేస్తుంది. దేశంలో తలసరి లభ్యత ఇటీవలి కాలంలో చూస్తే 1997లో 505.5గ్రాములుంటే, అది 2001 తాత్కాలిక లెక్కల ప్రకారం 417గ్రాములకు తగ్గింది. గత రెండు సంవత్సరాలూ కరువు కాలం కాబట్టి, పంట తగ్గింది కాబట్టి ఈ లభ్యత ఇంకా తగ్గే వుంటుంది. ఈ అంకెలు కేవలం 'లభ్యత' గురించి మాత్రమే, అంత తింటున్నారని కాదు.

ఇంకో విషయం దారిద్ర రేఖను అధికారులు ఎలా నిర్ణయించారో వింటే నవ్వురాక మానదు. ఉదాహరణకు ఒక స్త్రీకి మూడు చీరల కంటే ఎక్కువగా ఉంటే ఆమెను దారిద్రరేఖకు కిందగా ఉన్నట్లు భావించరు. కాగా ఆమెకు తెల్ల కార్డు రాదు. అలాగే అప్పో, సప్పో చేసి, లేక తిండిఖర్చులు తగ్గించుకొనో ఓ సైకిలు కొనుక్కొంటే అతడు కూడా తెల్లకార్డుకు అనర్హుడు! ఒక అంచనా ప్రకారం మొత్తం ఆహార సబ్సిడీ 2002-03లో సుమారు 25వేల కోట్లయితే, అందులో కేవలం 7501కోట్లు లేదా మూడవ వంతు మాత్రమే పేదలకు దక్కుతుంది. పేదలకోసం ఏం చేసేవయ్యా అని ప్రభుత్వాన్ని అడిగితే అంత్యోదయ, పనికి ఆహారం, మధ్యాహ్నం భోజనం దళితులు, స్త్రీ, గిరిజన బాలురకు హాస్టల్స్‌లో ఇచ్చే సబ్సిడీ-ఇవన్నీ కలుపుకొంటే. రు.7500కోట్లు పూర్వం విభజన పేదలు, ధనికులు అని వుండేది. వాజ్‌పేయ్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదల్లో ఈ విభజనను ప్రవేశపెట్టారు. విభజించి పాలించు అనే బ్రిటిష్ సామ్రాజ్యవాదుల సిద్ధాంతాన్ని అక్షరాలా అమలుపరుస్తున్నారు. అంత్యోదయ కుటుంబాలు, దారిద్రరేఖకు కిందవున్న కుటుంబాలు, పైన వున్న

కుటుంబాలు-ఇలా విభాగాలు చేసి ఒక్కొక్కరికి ఒక్కో రేటు నిర్ణయించారు. ఇక్కడ ఓ విషయాన్ని గుర్తుంచుకోవాలి. పేదలు తమ కనీస ఆహార అవసరాల కోసం తమ ఆదాయంలో ప్రతి నూరు రూపాయల్లో 60రూపాయలు తిండిగింజలకే వెచ్చిస్తారు.

పైన చెప్పినట్లు ఆహారభద్రత చేకూరాలంటే, ముందు పని భద్రత లభించాలి. ప్రణాళికా సంఘం లెక్కల ప్రకారం దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో 1983-94 మధ్య కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లభ్యత సంవత్సరానికి 1.7శాతం చొప్పున పెరిగితే, 94-00లో అది 0.5కు పడిపోయింది. నిజ వేతనాలు పెరుగుదల 80వ దశకంలో అయిదు శాతం నుండి 90వ దశకంలో 2.5శాతానికి తగ్గింది. ఏ రాష్ట్రాల్లో అయితే జీతాల పెరుగుదల రేటు బావుందో, అక్కడ పేదరికం తగ్గింది.

ఆహారభద్రత లేనప్పుడు, పోషకాహార విలువలు తగ్గినప్పుడు అది ఆరోగ్యం మీద దెబ్బ తీస్తుంది. ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రొఫెసర్ సునీలా మిట్టల్ న్యూఢిల్లీలో ఒకగోష్ఠిలో ప్రసంగిస్తూ ఒక లక్ష సజీవ ప్రసవాలలో మరణాల రేటు భారతదేశంలో 43.7కాగా, శ్రీలంకలో 30, అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటి మాత్రమే. శిశుమరణాల రేటు దేశంలో ప్రతీ వెయ్యి జననాలకు 72కాగా, శ్రీలంకలో 18, థాయ్‌లాండ్‌లో 19 అని ఆమె చెప్పారు. 34శాతం పిల్లలు పుట్టినప్పుడు ఉండాల్సిన బరువు కన్నా తక్కువగా వున్నారు.

ఎన్ని అవకతవకలున్నా 80వ దశకం ఆఖరు వరకూ చవక దుకాణాల వ్యవస్థ పర్వాలేదనే విధంగా నడచింది. మన రాష్ట్రంలో రెండు రూపాయల కిలోబియ్యం పథకం పేదలకు ఒక వరం లాంటిది. అప్పుడు ఆర్థిక శాస్త్రవేత్తలు చేసిన సర్వేల ప్రకారం పేదరికం కొంతమేరకు తగ్గటానికి తోడ్పడింది. పేదలకు ఆహార భద్రత కల్పించింది. 90వ దశకం ప్రారంభంలో కష్టాలు మొదలయ్యాయి. ప్రపంచ బ్యాంకు షరతుల మేరకు సబ్సిడీల తగ్గింపు, రేషన్ కార్డుల కుదింపు, కిలో బియ్యం ధర రెండు నుంచి అయిదు-ఆరు రూపాయలకు పెరగటంతో ఆహారభద్రత కొరవడింది.

మనకు సుద్దులు చెప్పే అభివృద్ధి చెందిన దేశాలు వారివారి దేశాల్లో రైతులకు ఎడమచేత్తో, కుడిచేత్తో సబ్సిడీలు ఇస్తూ, మనలను సబ్సిడీలు తెగ్గొయ్యమంటే జీహుజూర్ అంటూ తలవంచి ఆచరణలో పెట్టడంతో రైతుల, ప్రజల సమస్యలు ఇనుమడించాయి. ప్రజాతంత్రవాదులు, వామపక్షాలు ఎంత వారించినా వినకుండా ప్రభుత్వం ముందుకు సాగటంతో ఆహార అభద్రత ఏర్పడింది. ఈ గుడ్డి, చెవిటి ప్రభుత్వానికి, ఈ విషయం గ్రహించటానికి 13సంవత్సరాలు పట్టింది. మొన్నమొన్న కాన్‌కున్ సమావేశంలో ఒక నిశ్చిత వైఖరిని తీసుకొని అమెరికాను వెనుకడుగు వేయించింది.

ప్రపంచ వ్యవస్థ డబ్ల్యు.టి.ఓ.లో వెనుకడుగు వేయించినంత మాత్రాన పేదలకు ఒరిగేదేమీలేదు. ఎందుచేతనంటే, దేశంలో ప్రభుత్వవిధానాలు పేదరికాన్ని ఎంత మాత్రమూ తగ్గించే విధానాలు కావు. ఉద్యోగ వసతిని పెంపొందించటం మాట అటుంచి, మరింత క్లిష్టతరం చేసే విధానాలనవలంబిస్తుంది ప్రభుత్వం. ఆహార భద్రత నిలకడగా కొనసాగాలంటే ప్రజలు అప్రమత్తులై వ్యవహరించాలి. ○

ఉపాధ్యాయుడా, 20 చేతుల కార్తవీర్యార్జునుడా?

పాఠాలు చెప్పటం ఉపాధ్యాయుని పని, ఆ పనికే అతనికి జీతం ఇస్తారు.

కాని అతనికి ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతలు చూడండి

1) జనాభా లెక్కలు 2) పల్స్ పోలియో 3) విద్యా కమిటీ ఎన్నికల డ్యూటీ 4) డ్రాఏవుట్స్‌పై శిక్షణ 5) ర్యాలీలు, 6) చదువుల పండుగ 7) బాలికాసాధికారిత సదస్సులు, 8) ఎన్నికల డ్యూటీలు 9) ఓటర్ లిస్టుల తయారీ 10) జన్మభూమి 11) పచ్చదనం-పరిశుభ్రం 12) గుణాత్మక విద్యా కార్యక్రమం 13) ఆరోగ్యానికి సంబంధించిన గోష్ఠులు 14) చర్చారంభ కేంద్రాల నిర్వహణ 15) మధ్యాహ్న భోజన పథకం 16) అక్షర సంక్రాంతి 17) అర్ధరాత్రి ఫోన్లు, ఫాక్స్, నెట్ మెసేజ్‌లు 18) ఫ్యామిలీ షీట్స్, డేటా బేస్ ఫారాలు పూరించటం 19) పదవ తరగతికి, ఇంటర్మీడియెట్ డ్యూటీలు 20) స్పాట్ వాల్యుయేషన్లు.

ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు పాఠాలు సరిగ్గా చెప్పరని ఒక విమర్శ వుంది. ఇన్ని బాధ్యతలు అప్పగించి చదువు సరిగ్గా చెప్పటం లేదని విమర్శలా? ○

ఆర్భాటంగా నిర్వహించిన 'ఆగ్' వల్ల ఆశయం నెరవేరేనా?

- ఎం.డి. హసన్ షరీఫ్

'రెండు ఖండాలు-ఒకే స్ఫూర్తి' నినాదంతో హైదరాబాద్‌లో జరిగిన తొలి ఆఫ్రో ఆసియన్ గేమ్స్ అభిమానులను వారం రోజులపాటు అలరించాయి. ఈ పోటీల ఉద్దేశ్యం నెరవేరినా భారత ప్రభుత్వ వ్యవహార శైలిపై సర్వత్రా నిరసన వ్యక్తమైంది. రెండు ఖండాలకు చెందిన వందలాది మంది క్రీడాకారులు, అధికారులు ఇక్కడ ఉత్సాహంగా గడిపారు. ముఖ్యంగా ఆఫ్రికా దేశానికి చెందిన ఆటగాళ్లు ఆసియా వాసులతో కలిసిపోయారు. ఇక్కడి అభిమానులు ఆటగాళ్లను ఆదరించారు. అదే సందర్భంలో కరువు వల్ల కోట్లాది మంది ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పెడచెవిన పెట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ అధికారుల సపర్యల కోసం దిగజారిన వైనం విమర్శలకు దారితీసింది. నమీబియాకు చెందిన 36 ఏళ్ల వెటరన్ అథ్లెట్ ఫ్రాంకీ ఫ్రెడెరిక్స్ అందరికీ స్ఫూర్తి దాయకుడిగా నిలిచాడు. అందరూ రిటైర్మెంట్ ప్రకటించే వయస్సులో ఫ్రాంకీ పోటీల్లో పాల్గొనడమే కాకుండా స్వర్ణ పతకం కూడా కైవసం చేసుకోవడం విశేషం. రోడ్డు ప్రమాదంలో ఒక కాలు పోగొట్టుకున్నప్పటికీ చెక్కు చెదరని మనో స్థయిర్యంతో ఈత కొలనులో పాల్గొని పతకాలు సాధించిన నటాలీ డుటోయిట్ కనబర్చిన ప్రతిభ ఈ పోటీలకే హైలైట్. టీనేజ్ టెన్నిస్ తార సానియా మీర్జా నాలుగు స్వర్ణ పతకాలు సాధించడం మన రాష్ట్రానికే గర్వకారణం. మన అథ్లెట్లు ఊహించినంతగా రాణించకపోయినప్పటికీ స్వర్ణ పతకాల్లో రెండో స్థానంలో (19), పతకాల సంఖ్యలో అగ్రస్థానంలో (79) నిలవడం ఆతిధ్య దేశంగా భారత్‌కు సంతృప్తినిచ్చింది. మన దేశంతో సహా వివిధ దేశాలకు చెందిన ఉత్తమ అథ్లెట్లను రప్పించడంలో విఫలమైన మన ప్రభుత్వం చేతకాని తనం మరోసారి బయటపడింది. చైనా ద్వితీయ శ్రేణి జట్టును పంపించినప్పటికీ అత్యధిక స్వర్ణ పతకాలను (25) ఎగరేసుకు పోయి ఎదురులేని దేశంగా మరోసారి నిరూపించింది.

భారత్ ఆశయం నెరవేరిందా?

రు. 168 కోట్ల రూపాయలు ఖర్చుచేసి నిర్వహించిన ఈ పోటీలు విజయవంతమయ్యాయా అనేది జవాబులేని మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. ఆర్భాటాలు చేయడంలో మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయం సాధించింది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రారంభోత్సవాన్ని, ముగింపు ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ముగింపు ఉత్సవంలో పేల్చిన బాణసంచాను ఇంగ్లండ్ నుండి దిగుమతి చేసుకున్నారంటే వారి ఆర్భాటం ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. అయితే వివిధ దేశాలకు చెందిన కళాకారులతో నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు స్ఫూర్తి దాయకంగా నిలిచాయి. ముఖ్యంగా ముగింపు ఉత్సవంలో చైనా కళాకారులు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కానీ పోటీల పట్ల నిర్వాహకులు ఎటువంటి శ్రద్ధ కనబర్చినట్లు లేదు. భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) అధ్యక్షుడు సురేశ్ కల్మాడీ నేతృత్వంలో జరిగిన ఏర్పాట్లలో సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనబడింది. ఢిల్లీ అధికారుల పెత్తనాన్ని రాష్ట్ర అధికారులు సహించలేక పోయారు. దీంతో వారికి సహకారం అందించకుండా మిన్నకున్నారు. ఫలితంగా పోటీలు ముగిసినప్పటికీ ఇందులో ఎన్ని దేశాలు పాల్గొన్నాయి, ఏఏ అథ్లెట్లు వచ్చారు అనే విషయాలను అధికారులు ఇప్పటికీ స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. భారత్‌తో సహా వివిధ దేశాలకు చెందిన అగ్రశ్రేణి అథ్లెట్లు ఇందులో పాల్గొనకపోవడం వల్ల పోటీలు కళ తప్పాయి. హాకీలో భారత్ సహా అన్ని దేశాలు ద్వితీయ శ్రేణి జట్లనే పంపించాయి. దీంతో మన దేశం సాధించిన స్వర్ణ పతకానికి విలువలేకుండా పోయింది. వెయిట్ లిఫ్టింగ్‌లో అందరూ కరణం మల్లేశ్వరీనే కలవరించారు. అయితే ఆమె ఇందులో పాల్గొనడానికి నిరాకరించి అందరినీ నిరాశపర్చింది. చాలామంది ప్రముఖ అథ్లెట్లను రప్పించడంలో నిర్వాహకులు విఫలమయ్యారు. టోర్నీ షెడ్యూల్ కూడా గందరగోళంగా జరిగింది. ఏ పోటీలు ఎప్పుడు జరుగుతాయో, ఏఏ దేశాలు పాల్గొంటాయో నిర్వాహకులు ఆఖరి నిమిషం వరకూ చెప్పలేకపోయారంటే సమన్వయం ఏ రీతిలో ఉందో ఊహించుకోవచ్చు. పోటీలను ప్రజలు తిలకించడానికి ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. గత డిసెంబర్‌లో జరిగిన జాతీయ క్రీడల సందర్భంగా పకడ్బందీ వ్యూహంతో రోజుకో ప్రాంతం నుండి విద్యార్థులను తీసుకొచ్చి పోటీలు తిలకించే ఏర్పాట్లు చేశారు. ఈసారి

అటువంటి ప్రయత్నమేమీ చేయలేదు. చివరిరోజు మాత్రం అన్ని ప్రాంతాల నుండి విద్యార్థులను తీసుకురావాలని ఆదేశాలు జారీచేశారు. తీరా విద్యార్థులు వచ్చిన తర్వాత స్టేడియాల్లో పోటీలు తిలకించేందుకు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో అన్ని ప్రాంతాల నుండి మూకుమ్మడిగా వచ్చిన విద్యార్థులు ఇక్కడి రద్దీకి తట్టుకోలేక పోటీలు తిలకించకుండానే వెనుదిరిగాడు. ఇన్ని కష్టాలు ఎదురైనా క్రీడలు విజయవంతమవడం వెనుక ప్రధాన కృషి వాలంటీర్లదే. వాళ్లు పగలూ, రాత్రి అనే తేడా లేకుండా శ్రమించి అథ్లెట్లకు, అధికారులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా జాగ్రత పడ్డారు.

బంగారు బాల సానియా మీర్జా

ఈ పోటీల్లో ప్రముఖంగా చెప్పుకోవలసింది టీనేజ్ సంచలన టెన్నిస్ తార సానియా మీర్జా గురించే. దాదాపు 65 దేశాలకు చెందిన వందలాది మంది ఆటగాళ్లు పాల్గొన్న ఈ పోటీల్లో అత్యధిక స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారిణి సానియా. ఆమె పాల్గొన్న అన్ని పోటీల్లోనూ స్వర్ణాల పంట పండించింది. మహిళా టెన్నిస్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్, టీం ఛాంపియన్ షిప్‌లలో ఆమె బంగారు పతకాలు సాధించి 'బంగారు బాల'గా నిలిచింది. 16 ఏళ్ల ఈ టీనేజర్ సానియా మన రాష్ట్ర అమ్మాయి కావడం గర్వించదగ్గ విషయం. ఈమెకు తోడు సికింద్రాబాద్‌లోని సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉద్యోగం చేస్తున్న జెజె శోభ హెప్టాథ్లాన్‌లో స్వర్ణ పతకం సాధించింది. ఆఫ్రో ఆసియన్ గేమ్స్‌లో భారత్ తొలి స్వర్ణ పతకం అందించిన అథ్లెట్ కూడా మన రాష్ట్రానికే చెందినవాడు కావడం విశేషం. గగన్ నారంగ్ షూటింగ్‌లోని 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచాడు. షూటింగ్‌లోనే అంజలీ వేద్ పాఠక్, జస్పాల్ రాణా అద్భుత ప్రతిభ కనబర్చారు. అంజూ బాబీ జార్జ్, శక్తి సింగ్, నీలం జె సింగ్ తదితరులు కూడా భారత్‌కు పసిడి పంట పండించారు. ఈత కొలనులో మన స్విమ్మర్లు ఒక్క స్వర్ణం కూడా సాధించకుండా నిరాశపర్చారు. అయినా నిషా మిల్లెట్, రిచా మిశ్రా, అక్బర్‌లు రజితాలు, కాంస్యాలతో ఫర్వాలేదనిపించారు.

ప్రపంచ రికార్డు మహిళలదే

ప్రతి భారీ టోర్నమెంట్‌లో కొత్త రికార్డులు నమోదవడం సర్వసాధారణం. ఈ టోర్నీలో అగ్రశ్రేణి ఆటగాళ్లు పాల్గొనకపోవడంతో మూడు కొత్త రికార్డులు మాత్రమే నమోదయ్యాయి. షూటింగ్ 50 మీటర్ల స్పోర్ట్స్ రైఫిల్ విభాగంలో కజకిస్తాన్‌కు చెందిన ఓల్గా డోవొగన్ 600 పాయింట్లకు 600 పాయింట్లు సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. అయితే ఈ రికార్డుకు అంతర్జాతీయ షూటింగ్ సమాఖ్య అధికారిక గుర్తింపు ఇవ్వడానికి నిరాకరించడం ఆమెకు బాధకలిగించింది. వెయిట్ లిఫ్టింగ్‌లో చైనాకు చెందిన సన్‌డాన్ 75 కిలోలకు పైబడిన విభాగంలో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఆమె క్లీన్ అండ్ జెర్క్‌లో 168.5 కిలోల బరువు ఎత్తింది. పతకాలు సాధించడంలో మహిళలు కూడా ముందంజలో ఉండడం విశేషం.

ఇంత ఆర్భాటంగా నిర్వహించిన పోటీల వల్ల భారత్‌కు ఏం లాభమైందో ఇప్పటికీ అర్థం కాలేదు. రాష్ట్రం, దేశం కరువుతో అల్లాడుతున్న ప్రస్తుత తరుణంలో 150 కోట్లకు పైగా రూపాయలు ఖర్చు చేసి ఆఫ్రో ఆసియన్ గేమ్స్ నిర్వహించడం అవసరమా అని మేధావులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో రోజుకూలీ లేక పస్తులు ఉంటున్న ప్రజలను పట్టించుకోకుండా విదేశాల నుండి వచ్చిన అధికారులకు నగరంలోని స్టార్ హోటళ్లలో విందులు ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసం అని వారు ఆవేదన చెందుతున్నారు. వివిధ దేశాల నుండి క్రీడాకారుల కంటే అధికారులే ఎక్కువ మంది వచ్చారు. వారందరి విందులకు, వినోదాలకు అయ్యే ఖర్చంతా మనమే భరించాల్సి వచ్చింది. క్రీడలు నిర్వహించాలంటే ఆటగాళ్ల ఖర్చు భరించాలి కానీ, వినోదం కోసం వచ్చిన అధికారుల ఖర్చు భరించడం ఏంటో అర్థం కాని విషయం. కామన్వెల్త్ గేమ్స్ బిడ్‌ను ఎలాగైనా సాధించాలనే ఉద్దేశ్యంతో మన అధికారులు దిగజారుడు పనులకు కూడా ఒడిగట్టారు. పోటీలు ముగిసిన తర్వాత అధికారులు ఒక స్టార్ హోటల్లో అర్ధరాత్రి వరకు మందు, అర్ధ నగ్న నృత్యాల్లో లీనమడం, వారి ఆటపాటలకు రాష్ట్ర అధికారులు పూర్తిగా సహకరించడం సహించరాని విషయం. ఈ విందుకు రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులే కాకుండా, మహిళా ఐఎఎస్ అధికారులు కూడా హాజరయ్యారనే వార్త మన సంస్కృతిపై మాయని మచ్చగా నిలుస్తుంది. పోటీలు నిర్వహించేందుకు కావల్సిన మౌలిక సదుపాయాలు మన దేశంలో ఉన్నాయో లేదో పరిశీలించాల్సిన కామన్వెల్త్ ప్రతినిధి బృందం ఈ విందు వినోదాలకు లొంగిపోవడం గమనార్హం. ఈ చర్యలతో క్రీడా స్ఫూర్తిని మనవాళ్లే కాలరాస్తున్నారు. వివిధ దేశాల మధ్య స్నేహ సౌభ్రాతృత్వాలను, సంస్కృతి

సాంప్రదాయాలను పెంపొందించేందుకు సహకరించాల్సిన క్రీడలకు ఈ దుస్థితి కలగడం బాధాకరవిషయం.

రాజకీయ, ఆర్థిక సంబంధాలు బలపడాలి

తొలి ఆఫ్రో ఆసియన్ గేమ్స్ ద్వారా ఆసియా, ఆఫ్రికా ఖండాలకు చెందిన దేశాల మధ్య స్నేహ సౌభ్రాతృత్వాలను పెంపొందించుకోవాలన్న లక్ష్యం కొంతవరకైనా నెరవేరితే సంతోషమే. ఆఫ్రికా ఖండంలో జరిగే రెండవ ఆఫ్రో ఆసియన్ గేమ్స్ వరకు రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలు బలపడేందుకు అన్ని దేశాలు కృషి చేయాలి. ప్రపంచంలో సగానికి పైగా జనాభా, వైశాల్యం కలిగిన ఈ రెండు దేశాలు కలిస్తే దుష్ట శక్తుల పన్నాగాలకు పగ్గం వేయగలం. రెండు ఖండాల దేశాలు ఏకమవడం ద్వారా ఏక ధృవ ప్రపంచం ద్వారా ప్రపంచ పోలీసుగా వ్యవహరించాలనే అమెరికా దుర్బుద్ధికి సంకెళ్లు వేయగలవు.

మౌలిక వసతులపై దృష్టి నిలపాలి

ఆఫ్రో ఆసియన్ గేమ్స్, కామన్వెల్త్, ఒలింపిక్స్ వంటి భారీ టోర్నీలను నిర్వహించినంత మాత్రాన ప్రపంచ క్రీడా పటంలో భారత్‌కు సుస్థిర స్థానం లభిస్తుందని ఆశించడం అత్యాశే అవుతుంది. దేశంలో ఉన్న క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో రాణించి ఇటువంటి భారీ టోర్నీల్లో పతకాలు సాధించినప్పుడే భారత్ కోరిక నెరవేరుతుంది. వందలాది కోట్ల రూపాయలను భారీ టోర్నీలను నిర్వహించడానికి ఖర్చు చేసే బదులు ప్రతిభ కలిగిన ఆటగాళ్లను ప్రోత్సహించడంపై వెచ్చిస్తే లాభం ఉంటుంది. వారు ప్రతిష్టాత్మక టోర్నీల్లో పతకాలు సాధించి దేశం ప్రతిష్టను ప్రపంచం నలువైపులా చాటుతారు. దేశంలో, రాష్ట్రంలో క్రీడలకు ఇంకా మౌలిక సదుపాయాలు లేవు. జాతీయ క్రీడ అయిన హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్ వంటి క్రీడలకు మండల, జిల్లా స్థాయిలో కనీసం సరైన మైదానాన్ని ఏర్పాటు చేయాలన్న స్పృహ ప్రభుత్వానికి లేదు. ఈ విషయంలో చైనాను ఆదర్శంగా తీసుకుంటే బాగుంటుంది. మనకంటే ఒక సంవత్సరం ఆలస్యంగా స్వాతంత్ర్యం పొందిన చైనా ఇప్పుడు అన్ని రంగాలతో పాటు క్రీడల్లో కూడా అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసే స్థాయికి ఎదిగింది. దీనికి వారు పకడ్బందీగా అనుసరించిన వ్యూహమే కారణం. రాజకీయాలకు అతీతంగా ప్రతిభకు పట్టం కట్టే రోజులు వచ్చినప్పుడే దేశంలో కూడా క్రీడారంగానికి మంచిరోజులు వస్తాయి. క్రీడా పాలసీని రాతలకే పరిమితం చేయకుండా అమలు పర్చేందుకు కృషి చేయాలి. మట్టిలో మాణిక్యాలైన గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి ప్రభుత్వ ఖర్చుతో అభివృద్ధి చేయాలి. అప్పుడే ఒలింపిక్స్, కామన్వెల్త్, ఆఫ్రో ఆసియన్ గేమ్స్‌లో భారత ఆటగాళ్లు పతకాల పంట పండిస్తారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగి ప్రతిభలేని వారిని అంతర్జాతీయ పోటీలకు పంపిస్తే దేశం పరువు మంటగలవడం మినహా మరేమీ లాభం లేదు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవహారాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. గత సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన 32వ జాతీయ క్రీడల్లో మన రాష్ట్రం తరపున వివిధ రాష్ట్రాలకు చెందిన అథ్లెట్లను అరువు తెచ్చుకున్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన నజరానాలకు ఆశపడి మన రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన వారెందరో ఉన్నారు. వారి సహకారంతో పతకాల పట్టికలో మన రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. కానీ పోటీల సందర్భంగా రాష్ట్రానికి చెందిన కనీసం ఒక యువ అథ్లెట్ ఆటను కూడా మెరుగుపర్చలేకపోయింది ప్రభుత్వం. తీరా మన రాష్ట్రానికి పతకాలు తెచ్చిన అథ్లెట్లకు ప్రకటించిన నజరానాలకు కూడా చంద్రబాబు నాయుడు ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెందడం ఆటగాళ్ళ వంతయింది. జాతీయ పోటీల్లో పతకాలు సాధించినందుకు తనకు రావాల్సిన 27 లక్షల రూపాయలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదని స్విమ్మింగ్ ఛాంపియన్ రిచామిశ్రా ఆవేదన వ్యక్తం చేసింది. అందుకే ఆర్భాటాలకు పోతే చివరికి మిగిలేది తిట్లు, శాపనార్థాలే. ○

చందాదారులకు విజ్ఞప్తి

మొదటి సంచిక నుంచి చందాదారులుగా చేరినవారి చందా డిసెంబరు నెలాఖరుతో ముగుస్తుంది. వారు అంతా తిరిగి చందాదారులుగా చేరి వార్షిక చందా 120 రూ.లను మనీఆర్డరు లేదా డ్రాఫ్టు రూపంలో పంపడం ద్వారా మా ఈ కృషికి మీ సహకారాన్ని అందించాలని కోరుతున్నాం.

సం./-

దళితులకు మానవ హక్కులా ?

(ఇటీవల విడుదల అయిన "దళిత మానవ హక్కుల నిఘా 2000-2003" సారాంశాన్ని దిగువన ఇస్తున్నాం - సం.)

కొత్త శతాబ్దం మొదటి మూడు సంవత్సరాలు, ఏప్రిల్2000 మార్చి 2003 మధ్య, ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన1,194 దళిత మానవ హక్కుల ఉల్లంఘనలను 'సాక్షి' దళిత మానవ హక్కుల నిఘా నివేదిక రూపంలో పొందుపరిచింది. ఆంధ్రప్రదేశ్ జనాభాలో 16 శాతం వున్న దళితులను యింకా అంటరానివారిగానే చూస్తున్నారు. దళితులు తమ హక్కులను గుర్తిస్తూ వాటిని పొందే ప్రయత్నాలన్నిటికి తిరుగు జవాబుగా దళితేతరుల చర్యలన్నీ హింసాయుతంగా వున్నాయి.

కులాధిపత్యాన్ని, దళితులను తమకన్నా హీనస్థాయిలో వుంచడానికి దళితేతరులు మానభంగాలు, హత్యలు చేయడం సర్వసాధారణమైంది. నామాల బాలస్వామి అనే దళిత యువనాయకుడు తన గ్రామంలో దళితులు దేవాలయంలోకి ప్రవేశించడంలో ముందున్నాడు. దళితేతరుల ప్రమేయం లేకుండా దళితులు ఏ రాజకీయ వర్గానికి మద్దతు ఇవ్వాలో నిర్ణయించినాడు. దళిత వ్యవసాయ కార్మికులకు చట్టం ప్రకారం కూలీ ఇవ్వాలని పోరు సలిపినాడు. దళితేతరులు ప్రణాళిక ప్రకారం మూకుమ్మడిగా బాలస్వామి ఇంటిపై అర్ధరాత్రిలో దాడిచేసి, అతన్ని ఇంటినుండి బయటకు లాగి కొన్ని గంటల వరకు అందరిముందు కొట్టి, ఒంటిపై కిరోసిన్‌పోసి సజీవంగా మండుతున్న గడ్డివాములోకి తోసివేశారు. కులాధిపత్యానికి, కుల దురహంకారానికి మారురూపమైన జోగిని వ్యవస్థ నుండి బయటపడాలనే ప్రయత్నంలో, పాఠశాలలో చదువుకుంటున్న దళిత బాలిక అభివృద్ధిని, పురోభివృద్ధిని సహించలేని అగ్రకుల యువకుడు, ఆ దళిత బాలికను బలవంతంగా ఎత్తుకెళ్ళి మానభంగం చేశాడు. అగ్ర కులస్తుడి కబంధ చెరనుండి తప్పించుకొని తనపిల్లవాడిని వేరే ఊరిలో చదివించుకోవాలనుకున్న గెద్దాడ లక్ష్మీ అనే దళిత స్త్రీని ఆ అగ్రకులస్తుడు ఓర్వలేక తన మిత్రులతో సామూహిక మానభంగం చేయించి హత్యచేశాడు. వందల సంఖ్యలో ఇలాంటి హత్యలను, మానభంగాలను నివేదికలో పేర్కొనింది.

అగ్ర కులస్తుల అమానవీయ చర్యలను "దాడులు", దళితులను నగ్నం చేసి ఊరేగించడం", "సాంఘిక బహిష్కరణ", " ఆస్తులపై దాడి, ఆక్రమించుకోవడం, నాశనం చేయడం", "అస్పృశ్యత పాటించటం" గా విభజించారు.

న్యాయంగా రావలసిన కూలీ డబ్బులు అడిగినందుకు, అనంతపురం జిల్లాలో ఒక అగ్రకుల భూస్వామి, నారాయణమ్మ అనే దళిత స్త్రీని బట్టలు ఊడదీసి ఆమెను నగ్నంగా ఊరి వీధుల్లోఈడ్చుకెళ్ళాడు. దళిత కులానికి చెందిన చిలకపాటి ఇశ్రాయేలు ఎన్నికల్లో జరిగిన అక్రమాల గురించి ప్రశ్నించినందుకు అతన్ని అగ్రకులస్తులు గుంజకు కట్టి, కను బొమ్మలు, మీసాలు, తలవెంట్రుకలు కత్తిరించి " మాల లంజకొడకా" అని తిట్టి కొట్టినారు. తొకల గంగులమ్మ అనే దళిత స్త్రీ కట్టెలు కొట్టుకొనడానికి వెళ్తూ అగ్రకులస్తులు పొలాల నుండి వెళ్ళిందని అగ్రకులస్తులు దళితవాడమీద దాడిచేసి గంగులమ్మను ఆమె భర్తను కొట్టడమేకాకుండా అడ్డువచ్చిన ఇతర దళిత స్త్రీలను కూడ కొట్టి వారిమీద మూత్రం పోశారు. పాపక్క అనే దళిత స్త్రీ బట్టలు లాగి వేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసే ప్రయత్నం చేసిన ఇంకొక దళితున్ని చెట్టుకు కట్టి చిత్రహింసలు పెట్టారు. రాజుపాళెం గ్రామ దళితులు ఒక భూమి వివాదం కేసు గెలవగా, ఫోర్జరీ పత్రాలు కోర్టులో చూపెట్టి ఓడిపోయిన అగ్రకులస్తుడు, ఓడిపోయిన అవమానంతో తోటి అగ్రకులస్తులను తీసుకొని దళిత వాడమీద మారణాయుధాలతో దాడి చేశాడు. 150 దళిత ఇండ్లకు నిప్పంటించి, కాల్చిబుగ్గిచేశాడు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఏమి చేయలేదు.

'సాక్షి' రూపొందించిన నివేదికలో ఇలాంటి 734 సంఘటనల పూర్వాపరాలు పొందుపరిచారు. ఈ సంఘటనల్లో దళితులపై దాడులు చేయడం, ఆర్థిక బహిష్కరణకు గురిచేయడం, దూషించడం, బలవంతంగా మూత్రం త్రాగించడం, మలం తినిపించడం, గుండు గీయించడం, బహిరంగంగా అవమానించడం, వారి కళ్ళముందే వాళ్ళ ఇళ్ళు తగలబెట్టడం లాంటి అకృత్యాలు నివేదికలో వున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే గణనీయమైన సంఖ్యలో దళిత మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయి. 2002-2003 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు కనీసం 34 మందిని కస్టడీలో హత్యచేశారు. వరంగల్ జిల్లా పోలీసులు ఒక దళిత యువతిని లాకప్‌లో సామూహికంగా మానభంగం చేసి, ఆ యువతి తల్లిని లాకప్‌లో చిత్రహింసలు చేశారు. ఈ విషయాలు ఎవరికైనా చేప్తే చంపేస్తామని బెదరించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఒక దళిత స్త్రీని లైంగికంగా

వేధించి లోబరుచుకుని, తరువాత వివాదాల వల్ల ఆమెపై కిరోసిన్ పోసి సజీవంగా తగుల బెట్టాడు. ఒక పోలీసు ఎస్పీ, ఒక దళిత ఉద్యమకారుడిని బహిరంగంగా అనేకసార్లు "మాదిగా లంజకొడకా" అని తిట్టి, అవమానపరిచి అతని ఆత్మహత్యకు కారకుడయ్యాడు. రాజకీయ హత్యకు ప్రథమ సాక్షిగా వున్న దళితుణ్ణి పోలీసు లాకప్‌లో కొట్టి చంపారు. ఈ సంఘటనలో అనేక మంది దళితులను బట్టలూడదీసి చిత్ర హింసలు పెట్టారు. ఈ కేసు విషయం బయట చెప్తే దళిత స్త్రీలను రాక్షసంగా మానభంగం చేస్తామని బెదిరించారు.

భారతదేశంలో మిగతా రాష్ట్రాల్లాగా, ఆంధ్రప్రదేశ్‌లో కూడా దళితులు న్యాయం పొందడానికి చట్టాలు, వ్యవస్థ రూపొందించారు. భారత రాజ్యాంగం (ఆర్టికల్15-17), పౌరహక్కులు పరిరక్షణ చట్టం 1955, ఎస్.సి., ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టం 1989, ఇంకా 1995 రూల్స్ దేశవ్యాప్తంగా దళితుల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వాలను కాపాడాటానికి అమలులో వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1976 నుండి 1980 వరుకు అనేక ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయినాయి. ఈ చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు పోలీసు, పాలనా యంత్రాంగానికి ఖచ్చితమైన నిర్దేశాలు ఇస్తూ దళితులపై జరిగే అత్యాచారాలను అడ్డుకొని అంటరానితనాన్ని రూపుమాపడానికి కావాల్సిన అధికారాలు ఇస్తూ వారిని బాధ్యతాయుతం చేసాయి.

ఇలాంటి పరిస్థితుల్లో దళితులపై జరుగుతున్న అత్యాచారాలు, హింస చట్టాలు, న్యాయవ్యవస్థ లేక కాదు. ఈ పరిస్థితి కేవలం వున్న చట్టాలు, న్యాయ వ్యవస్థ పని చేయకపోవటం వల్లనే. పోలీసు, రెవిన్యూ యంత్రాంగం, న్యాయ వ్యవస్థ పని తీరులను పరిశీలించినట్లయితే అందులో పాతుకుపోయిన విపరీత కుల పక్షపాతం / వివక్షలను ఎత్తిచూపెడుతుంది.

కులవివక్ష ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో విస్తృతంగా కనపడుతుంది. చాలా సంఘటనల్లో పోలీసులే స్వయంగా దళితుల ఇండ్లు తగులబెట్టడం, హత్యలు చేయడం, మానభంగాలు చేయడం, చిత్రహింసలు చేయడం చేసారు. ఇలాంటి నేరాలు చేసే అగ్రకుల నేరస్తులతో సర్వసాధారణంగా కుమ్మక్కయ్యారు. కొన్ని అసాధారణ సమయాల్లో తప్పిస్తే, దళితులపై అత్యాచారాలు చేసేవారితో కుమ్మక్కవడం. దళితులపట్ల నిర్లక్ష్యంగా అహంకారంతో వ్యవహరించడం, విచారణలో దళితులకు వ్యతిరేకంగా పనిచేయడం, అగ్రకులస్తులకు సానుకూలంగా పనిచేయడంలో పోలీసుల చరిత్ర విశ్లేంచతగినది.

దళిత మానవహక్కుల ఉల్లంఘన సంఘటనల జాబితా తయారు చేయడంతో పాటు, గత నాలుగు సంవత్సరాలలో దళితులపైన జరిగిన 101 అత్యాచారాల కేసులలో న్యాయం పొందే ప్రక్రియను 'సాక్షి' పర్యవేక్షించింది. ఈ 101 కేసుల్లో కేవలం 17 శాతం కేసులు మాత్రమే పోలీసులు ఎస్., ఎస్.టి.(పిఒఎ) చట్టం క్రింద రిజిస్టర్ చేశారు. అంటే 83 శాతం అత్యాచారాలను పోలీసులు ఆదిలోనే బయటకి పొక్కకుండా అంతం చేశారు. దళితులను ఫిర్యాదు చేయకుండా చూడడం లేదా నిరోధించడం, ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయకపోవడం పోలీసులకు పరిపాటి. సెప్టెంబరు 2001లో దళిత స్త్రీ కిస్టమ్మ మానభంగానికి గురైనపుడు, పోలీసులు ఫిర్యాదు తీసుకోవడానికి నిరాకరించారు. దళిత సంఘాలు, జనం పదిహేను రోజులు ప్రదర్శనలు జరిపి, పత్రికలు ప్రచారం చేసిన తర్వాతే పోలీసులు కేసు రిజిస్టర్ చేసి నిందితుణ్ణి అరెస్టు చేశారు.

పోలీసులు కేసులు రిజిస్టర్ చేసినా, వాటిని శిక్ష అధికంగా పడే ఎస్., సి., ఎస్.టి. (పిఒఎ) చట్టం క్రింద కాకుండా, శిక్ష తక్కువగాపడే సెక్షన్ క్రింద నమోదు చేస్తారు. ఇలాంటి చర్యలు పోలీసులు చట్టాలు తెలియక చేయడం లేదు, కాని అగ్రకులస్తులను శిక్షలనుండి తప్పించడానికి ఇలాంటివి చేస్తారు. 'సాక్షి' నివేదికలో విశ్లేషించిన 101 కేసుల్లో 44 శాతం కేసులు పైన చెప్పిన రీతిగా అగ్రకుల నేరస్తులను తక్కువ శిక్ష పడేలాగ పోలీసులు రిజిస్టర్ చేశారు.

అత్యాచారం కేసులు రిజిస్టర్ అయ్యే సమయంలో, అగ్రకులస్తుల ప్రలోభాలకులోనై దళితులమీద తప్పుడు కేసులు పెట్టి వారిని అరెస్టు చేస్తారు. అత్యాచారానికి గురైన దళితులను కేసు విషయంలో రాజీపడాల్సిన పరిస్థితులు కల్పిస్తారు. అగ్రకులస్తుల మీద కేసు ఉపసంహరించుకుంటేనే వారిని విడుదల చేస్తామని అత్యాచారానికి గురైన వారిని వత్తిడి చేస్తారు. ఉదాహరణకు, నామాల బాలస్వామి హత్యకేసులో, సాక్షులు గుర్తించిన అగ్రకుల నేరస్తులతోపాటు హత్యకు సంబంధంలేని ఏడుమంది దళితులను కూడా అరెస్టు చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన దళిత కుటుంబాలవారి సాయంతో హత్యకావింపబడిన బాధితుడి కుటుంబ సభ్యుల మీద నమోదైన కేసు ఉపసంహరించుకోకుంటే జైల్లో వున్న దళితులను విడిచిపెట్టరని బెదిరించారు.

ఆంధ్రప్రదేశ్‌లోను ఇంకా భారతదేశమంతటా, దళితులపై నమోదైన తప్పుడు కేసులే త్వరగా పోలీసులు చేపట్టి నిరపరాధ దళితులను శిక్షపడేలా చూస్తారు.

'సాక్షి' విశ్లేషించిన కేసుల్లో 5 శాతం కన్నా తక్కువ కేసులు కోర్టు వరకు వచ్చాయి. ఇందులో 95 శాతం నేరస్తులు కోర్టు విచారణ ఎదుర్కోలేదు.

పోలీసులు రిజిస్టర్ చేసిన 17 శాతం కేసుల్లో దాదాపు ఎక్కువ కేసుల్లో పోలీసులు విచారణ జరపలేదు. కొట్టే బాలయ్య హత్యా విషయం, హతుడి భార్య ఫిర్యాదు చేసినా, పోలీసులు నిందితులను అరెస్టు చేయలేదు. పోలీసుల ఆసరాతో ఆగ్రకుల నిందితులు. హత్య తరువాత కొన్ని రోజులకు బాలయ్య భార్యను బహిరంగంగా అందరి ముందు కట్టి, "ఒసే లంజా.. నీకు ఎంత ధైర్యమే. మామీద కేసు పెట్టడానికి ? నీ మొగుడికి పట్టిన గతే నీకు పట్టిస్తాము" అని బెదిరించారు. బాలయ్య హత్య, అతని భార్యపై దాడి జరిగిన మూడు నెలల తరువాత కూడా పోలీసులు ఎటువంటి చర్య తీసుకోలేదు. హతుడి కుటుంబ సభ్యులు భయాందోళనలతో జీవిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర చట్టాలు పోలీసులు అత్యాచారాలకు గురైన భాదితులకు తక్షణ సహాయక చర్యలు పునరావాస వసతులు కల్పించాలి. ఎస్.సి..ఎస్.టి (పిఒఎ) చట్టం క్రింద వున్న నష్ట పరిహారం అత్యాచారాలకు గురై నిలువ నీడలేక, తినడానికి తిండిలేక పనిచేయడానికి పనిలేక, ఆదాయాలు లేక వుండే దళిత భాదితుల కోసం ఈ నష్ట పరిహారం నిర్దేశించబడింది. 'సాక్షి' విశ్లేశించిన కేసుల్లో, నష్టపరిహారం విషయం, సమాచారం కేవలం 27.4 శాతం కేసుల్లో మాత్రం లభ్యమైంది. ఇందులో 49.5 శాతం కేసుల్లో పాలనా యంత్రాంగం దళిత భాదితులకు ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారం యివ్వలేదు.

మొత్తం మీద 'సాక్షి' విశ్లేషించిన కేసుల్లో 95.1 శాతం కేసుల్ని పోలీసులు, ఆగ్ర కులస్థులు దళితులను భయపెట్టి, బెదిరించి, నిర్లక్ష్యం చేసి నమోదు కాకుండా చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్.సి., ఎస్.టి. (పిఒఎ) చట్టం నమోదైన కేసుల్లో ఇచ్చిన తీర్పులను పరిశీలిస్తే రెండు విషయాలు కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నాయి. 1999-2000 సంవత్సరాలకు సంబంధించి లభ్యమైన వివరాల ప్రకారం 2,625 కేసులు 1999-2000 సంలో కోర్టు విచారణకు వచ్చాయి. ఇందులో 167 (6.4%) ముగియగా 93.6 శాతం యింకా పెండింగ్‌లోనే వున్నాయి. ఈ 167 కేసుల్లో, 89 శాతం కేసుల్లో ఆగ్రకులస్తుల నేరం పోలీసులు ఋజువు చేయలేదు.

'సాక్షి' గూంటూరు జిల్లాలో చేసిన 30 కేసుల సర్వే ప్రకారం (14 మానభంగాలు, 11 హత్యలు, 11 హత్యాయత్నాలు, 4దాడులు) 14 కేసులు చాలాకాలంగా పెండింగ్‌లో వున్నాయి. 3 కేసుల వివరాలు అందుబాటులో లేవు. మిగతా 13లో, 11 కేసులు కొట్టి వేశారు. నిందితుల్లో బలత్కారం చేయబోయిన వారిని కూడా విడుదల చేశారు. రెండు హత్యకేసుల్లో ముద్దాయిలకు శిక్షపడింది. అందులో ఒకరికి రెండు సంవత్సారాలే శిక్షవేశారు.

జాతీయ స్థాయిలో హైకోర్టులో విచారణకు వచ్చిన 78 కేసులను 'సాక్షి' విశ్లేషించింది. ఇందులో 67.9 శాతం కేసుల్లో దళితులకు వ్యతిరేకంగా, అగ్రకులాల వారికి అనుకూలంగా తీర్పులు ఇచ్చారు. ఇందులో 76.2 శాతం కేసుల్లో నేరాలు తీవ్రమైనవి, శిక్ష 10 సంవత్సరాలకు పడాల్సినవి. 'సాక్షి' విశ్లేషించిన సుప్రీంకోర్టు కేసులు 6, హైకోర్టు కేసులు 78లో అధిక శాతం పోలీసులు, కింది స్థాయి కోర్టులు ప్రాథమిక స్థాయిలో చేసిన సాంకేతికపరమైన లోపాల వలనే తీర్పులు అగ్రకులస్తులకు అనుకూలంగా వచ్చాయి. ప్రభుత్వ యంత్రాంగం చేసే తప్పుల వల్ల, చిన్న చిన్న వ్యవహారిక లోపాల వల్ల దళితులకు న్యాయం జరగడం లేదు.

హైకోర్టు, సుప్రీంకోర్టులకు వచ్చిన కేసుల్లో ఇంకొక తరగతికి చెందినవి నిందితుల బెయిల్‌కు సంబంధించినవి. ఎస్.సి., ఎస్.టి. (పిఒఎ) చట్టం ప్రకారం దళితులపై అత్యాచారాల కేసుల్లో నిందితులకు బెయిల్ ఇవ్వరాదు. ఇది భారత రాజ్యాంగ విరుద్ధమని అగ్రకులాల వారు సుప్రీంకోర్టులో కేసు వేశారు. ఈ చర్య దళితులకు న్యాయం అందించే ప్రక్రియను, వ్యవస్థను తీవ్రంగా దెబ్బ తీస్తుంది. ఉదాహరణకు, దళితుడు అమృతయ్యహత్య కావింపబడిన నాలుగు సంవత్సరాలకు సి.బి.సి.ఐ.డి. సిబ్బంది హత్య జరిగిన గ్రామానికి విచారణకు వచ్చారు. అమృతయ్య సోదరుడు కృష్ణ సి.బి.సి.ఐ.డి. ముందు సాక్ష్యం చెప్పాడు. బెయిల్ మీద నిరాటంకంగా తిరుగుతున్న అగ్రకుల నేరస్తులు, సాక్ష్యం చెప్పాడన్న కక్షతో కృష్ణను హత్య చేశారు. బెయిల్ మీద బయటికి ఇచ్చిన అగ్రకుల నేరస్తులు భయపెట్టి, బెదిరించి, ప్రలోభ పెట్టి, కొట్టి బలత్కారం చేసి అనేక కేసుల్లో పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని దళితులకు న్యాయం జరగకుండా అడ్డుకున్న సంఘటనల్లో ఇది ఒకటి. ఈ కారణం వల్లనే చట్టసభ ఎస్.సి., ఎస్.టి. (పిఒఎ) చట్టం రూపొందించేటప్పుడు బెయిల్ విషయం ప్రత్యేకంగా ఒక సెక్షన్ పెట్టింది.

"హై-టెక్ సిటీ"గా పేరు పొందిన హైదరాబాద్ రాజధానిగా వున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంతమంది విదేశీ పెట్టుబడిదార్లను ఎలా ఆకర్షించాలా అనే ప్రయత్నాల్లో ప్రభుత్వం ఉంది. హింసాపూరితమైన అత్యాచారాలు, అత్యధిక సంఖ్యలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలు, ప్రభుత్వం స్వయంగా చేస్తున్న మానవ హక్కుల ఉల్లంఘనలు, చట్టం అమలులో పోలీసు, పాలనా యంత్రాంగాల నిరంతర వైఫల్యాలు, దళితులకు న్యాయం అందించడంలో నిరంతరం జాప్యం చేస్తున్న న్యాయవ్యవస్థ పనితీరు ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం, సభ్య సమాజంలో అన్ని స్థాయిలలో మిళితమై వున్న కుల వివక్షను వేలెత్తి చూపెడుతున్నాయి. 21వ శతాబ్దంలో దళితుల పరిస్థితి, అగ్రకులాల దురహంకారం, నేర ప్రవృత్తి తక్షణ చర్యలు అవసరమని కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్నాయి. ○

సామ్రాజ్యవాద సారాంశం దోపిడీయే

(సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలను అధ్యయనం చేయదలచిన వారికి ఇతర భాషా పత్రికలలోనూ పుస్తకాలలోనూ ఇంటర్నెట్ మీద విరివిగా సమాచారం లభ్యమవుతుంది. ఈ సమాచారం అంతా, ఈ విశ్లేషణలన్నీ తెలుగు పాఠకులకు అందడానికి భాష ప్రధాన ఆటంకంగా ఉంటుంది. ఈ అంతరాన్ని పూడ్చే కృషిలో మా వంతు ప్రయత్నంగా ఒక చదవతగిన వ్యాసాన్నో, పుస్తకాన్నో, అంశాన్నో వీలు మేరకు క్లుప్తంగా పరిచయం చేయదలచుకున్నాం. ఈ పరిచయం ద్వారా ఆసక్తి కలిగే పాఠకులు వీలైతే మూలరచన చదువుకోవచ్చు. మూలరచన భాష తెలియని పాఠకులకు కూడా స్థూలంగా విషయం అర్థం చేయడానికి ఈ పరిచయం ఉపయోగపడుతుంది. – సం.)

సామ్రాజ్యవాదం మీద ప్రామాణికమైన విశ్లేషణా గ్రంథాలు ఎన్నో రచించిన అమెరికన్ ఆర్థ శాస్త్రవేత్త హారీ మాగ్డాఫ్‌కు 2003 ఏప్రియల్ నాటికి 90 ఏళ్లు నిండాయి. 1969 నుంచి స్వతంత్ర సోషలిస్టు పత్రిక మంత్లీరివ్యూకు సహ సంపాదకుడుగా వున్న మాగ్డాఫ్ ది ఏజ్ ఆఫ్ ఇంపీరియలిజం (1969 ఇంపీరియలిజం ఫ్రంద కలోనిలియాన్ ఏజ్ టు ద ప్రజెంట్ (1977) గ్లోబలైజేషన్ టు వాటో ఎండ్ (1993), ఎ సేన్ ఆన్ ఇంపీరియలిజమ్ అండ్ గ్లోబలైజేషన్ (2002) వంటి స్వతంత్ర్య రచనలతో పాటు ప్రముఖ మార్క్సిస్టు అర్థ శాస్త్రవేత్త, మంత్లీ వ్యూ సంపాదకుడు పాల్ ఎమ్ స్వీజీతో పాటు మరెన్నో రచనలు చేశారు. ఆయన 90వ పుట్టినరోజు సందర్భంగా మంత్లీ రివ్యూ ఇవాల్టి సామ్రాజ్యవాదం అనే అంశంపై సదస్సును నిర్వహించింది. ఆ సందర్భంగా అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వెర్మంటోలో ఇంగ్లీష్ అధ్యాపకుడు హక్ గుట్‌మ్యాన్ మ్యాగ్డాఫ్‌ను ఇంటర్వ్యూ చేశాడు. ఆ ఇంటర్వ్యూలో నుంచి కొన్ని భాగాలు.

పెట్టుబడిదారి విధానం అభివృద్ధికి దారి తీస్తుందని పాలక భావజాలం చెబుతుంది. కొత్త ఆలోచన వచ్చిన వాళ్లు స్వంత చొరువతో కర్మాగారాలు తెరుస్తారని, కార్మికులను పనిలోకి తీసుకుంటారని అలా సప్లై డిమాండ్ పెరుగుతూ పోతూ ఉంటుందని అంటారు. ఈ నమూనాలో అర్థం ఉన్నట్లే కనబడుతుంది కాని ఇది నమూనా మాత్రమే, వాస్తవం కాదు. పెట్టుబడిదారీ అభివృద్ధికి చలనశక్తి మదుపు కాని మదుపు ఎట్లా పెట్టబడుతుందనేది సాఫీగా సాగే అంశం కాదు. వస్తువులను కొనడానికి తగిన శక్తి వినియోగదారుల దగ్గర లేనప్పుడు లేదా వాళ్లిష్టపడనప్పుడు మదుపు మందగిస్తుంది.

అందుకే పారిశ్రామిక వస్తువుల అమ్మకాలు ఒక పద్ధతి ప్రకారం సాగుతాయి. కొత్త వస్తువు రాగానే అమ్మకాలు ఉత్పత్తి విపరీతంగా పెరుగుతాయి. కొంత కాలానికి అవి కుంటుపడతాయి. ఉదాహరణకు అమెరికా ఆర్థిక వ్యవస్థను అభివృద్ధిలో కీలక పాత్ర వహించిన రిఫ్రిజిరేటర్లనే తీసుకోండి.

అమెరికాలో రిఫ్రెజిరేటర్ కనిపెట్టినప్పుడు మొత్తం పెట్టుబడిదారి అభివృద్ధి దానిమీదనే ఆధారపడి ఉన్నట్లు అనిపించింది. కాని జనానికి ఎన్ని రిఫ్రిజిరేటర్లు కావాలి. ఒక కుటుంబం ఎన్ని రిఫ్రిజిరేటర్లు వాడగలదు. మీరు బాగా ధనవంతులై మీ ఇంట్లో ఎక్కువలో ఎక్కువ రెండు రిఫ్రిజిరేటర్లు కావాలి. అంటే కొనగలిగిన వాళ్లందరూ కొనేసిం తర్వాత డిమాండ్ తగ్గిపోతుంది. చెడిపోయిన దాని స్థానంలో కొత్తది కొనడమో జనాభా పెరుగుదల వల్ల కొత్త కుటుంబాలు రావడమో మాత్రమే కొత్త డిమాండ్‌కు సృష్టిస్తాయి. అదేమంత పెద్ద డిమాండు కాదు.

మరి వ్యాపారాన్ని కొనసాగించడమెట్లా? విస్తరించడం ఎట్లా? అప్పుడే విదేశాలకు వ్యాపారాన్ని విస్తరించాలని ఆలోచన వస్తుంది. అంటే స్తబ్ధత వైపు దారితీయడమే సామ్రాజ్యవాదం తలెత్తడానికి ప్రధాన కారణాల్లో ఒకటి. కొత్త అన్వేషణ. అవసరాలు అందరికి చేరగానే పెట్టుబడిదారి అభివృద్ధి కొత్త ఉత్పత్తుల వైపు కొత్త అన్వేషణల

వైపు కొత్త ప్రజా సమూహాల వైపు చూస్తుంది. పెట్టుబడిదారి దేశాలు తమ పెరుగుదలరేట్లను యథాతథంగా ఉంచుకోడానికి విదేశీమార్కెట్లలోకి చొరబడ్డాయి.

వలసలను సంపాదించుకొనడంలో మరొక ముఖ్యమైన ప్రేరణ ముడిసరుకుల సరఫరాను యధాతదంగా ఉంచుకోవడం ఆ సరఫరాలో పైచేయి సాధించడం. ఇప్పుడు ముడిసరుకులంటే సుగంధ ద్రవ్యాల్లో, తేయాకో, పొగాకో కాదు. పారిశ్రామిక విప్లవం తర్వాత తలెత్తిన ఖార్కానాలకు పత్తి, రాగి, జింక్ వంటి కొత్త సరఫరాలు కావాలి. ఉత్పత్తులు సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినవైతే అంత ఎక్కువగా కష్టసాధ్యమైన మిశ్రలోహాలు కావాలి. ఈ లోహాలను సంపాదించడానికి పెట్టుబడిదారి వుత్పత్తి విదేశాలకు వెళ్లక తప్పదు. ఈ అత్యవసరమైన సరఫరాలను పొందడానికి ఎన్ని మార్గాలున్నప్పటికి ఆ సరఫరాలు నిరాటంకంగా కొనసాగడానికి పెట్టుబడిదారి విధానం రాజకీయాధిపత్యాన్ని కోరుతుంది.

కొత్త మార్కెట్లు కొత్త ముడి సరుకుల అవసరాలతో పాటు మరొక అంశం కూడా ఉంది. ఒక దేశంలో పెట్టుబడిదారి విధానం అభివృద్ధి చెందగానే అక్కడ కార్మికవర్గం ఎక్కువ వేతనాల కోసం తక్కువ పనిగంటల కోసం పోరాడుతుంది. పని పరిస్థితుల మెరుగుదల కోసం పోరాడుతుంది. అప్పుడు లాభాలను పెంచుకోవడానికి పెట్టుబడిదారు ఎక్కడ తక్కువ వేతనాలకు శ్రమశక్తి దొరుకుతుందో, ఎక్కడ ఎక్కువ దోపిడీకి అవకాశం వుందో, అక్కడికి తరలిపోతుంది. అందువల్ల ఏ దేశాల్లోకి ఈ పెట్టుబడిదారులు ప్రవేశిస్తారో ఆయా దేశాల్లో స్వతంత్ర అభివృద్ధి అవకాశాలు దెబ్బతినిపోతాయి. మానవజాతి చరిత్రలో వేరు వేరు కారణాల వల్ల అభివృద్ధి నమూనాలు అభివృద్ధి వేగాలలో తేడాలున్నాయి.

పెట్టుబడిదారి విధానం ప్రవేశంతో వలసదేశాల అభివృద్ధి దిశలే మారిపోయాయి. అంటే పెట్టుబడిదారి దేశం మీద ఆధార పడటం పెరిగిపోయింది. వలసలోని ప్రజల దారిద్ర్యం పెరిగిపోయింది.

ఆ తర్వాత తమ ఆధీన ప్రాంతాల పునర్విభజన కోసం ప్రపంచ యుద్ధాలు జరగడం, రెండు సార్లు ప్రపంచం పునర్విభజన జరగడం ఆ తర్వాత వలసల నుంచి సామ్రాజ్యవాద దేశాలు ఉససంహరించుకోవడం తెలిసిన కథ.

వలసల విముక్తి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారి దేశాలకు ఒక కొత్త సమస్యను సృష్టించింది. దీనివల్ల పాత వలస దేశాలను ప్రభావితం చేయడానికి వాటి మీద ఆధిపత్యం వహించడానికి నవీన వలస విధానం మొదలైంది. అభివృద్ధి చెందిన దేశాలు ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలతో పాటు అనేక రకాలుగా అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థలను శాసిస్తూ పాత వలసలలోని పాలక వర్గాలకు సహాయం చేస్తూ తమ అదుపును పెంచుకున్నాయి. తమ దేశాల్లోని ఆధిపత్య వ్యవస్థలకు మార్చి సామ్రాజ్యవాద అదుపు నుంచి తప్పించడానికి ప్రయత్నించే ప్రజా ఉద్యమాలను అణచివేయడంలో అవి భాగస్థులైనాయి.

తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు తమ సహజవనరులను అభివృద్ధి చేసుకోవడంలో పరిశుభ్రమైన నీటి సరఫరాను అందించడంలో ప్రజా జీవనాన్ని మెరుగుపరచడంలో సహాయపడే ఉద్దేశ్యంతో ప్రపంచబ్యాంకు రూపొందించబడింది. కాని ఆచరణలో ఆయా దేశాలలోని ప్రైవేటు పెట్టుబడికి బహుళజాతి పెట్టుబడికి దోహదం చేయడానికే వుపయోగపడింది. అలాగే మూడో ప్రపంచదేశాల రుణబారం పెంచడానికే ఉపయోగపడింది. ప్రపంచబ్యాంకు సంపన్నదేశాల్లో బాండ్లు అమ్మకం ద్వారా డబ్బు సంపాదిస్తుందని మరిచిపోకండి. అంటే అది ఆ మదుపుదార్లకు అసలును, వడ్డీని సంపాదించిపెట్టక తప్పదు.

1929 మహా సంక్షోభాన్ని దృష్టిలో వుంచుకొని ఐ.ఎమ్.ఎఫ్.ను తయారుచేసారు. చెల్లింపుల ముదరాలో కరెన్సీ మారకపు రేట్లలో బారీగా దేశాలు వస్తే పెట్టుబడిదారి దేశాలు నష్టపోతాయి కనుక అది జరగకుండా చూసేందుకు ఐ.ఎమ్.ఎఫ్.ను రూపొందించారు. కాని పెట్టుబడిదారీ దేశాలకు ఏది మేలో అభివృద్ధి చెందని దేశాలకు అది కీడు. ఈ పేద దేశాలలో మదుపు పెట్టడం అనే క్రమమే విదేశీ పెట్టుబడిదార్లకు వడ్డీని లాభాలను సుంకాలను సంపాదించి పెడుతుంది. విదేశీ మదుపు దారులకు చెల్లింపులను పేదదేశాలు చేయలేకపోయినప్పుడు ఐ.ఎమ్.ఎఫ్. రంగంలోకి దిగి అప్పులు వసూలు చేసి పెట్టే పాత్ర నిర్వహిస్తుంది. పేదదేశపు ఆర్థికవ్యవస్థ మీద వ్యవస్థాగత మార్పులు రద్దీ ఇంకా ఎక్కువ. అప్పులు ఇచ్చి ఇంకా ఎక్కువ రుణబారంలో దించి ప్రజల జీవన పరిస్థితులను మరింత క్షీణింపచేస్తుంది. ఈ సంబంధాల వల్ల అభివృద్ధి చెందిన ఉత్తరార్థ గోళపు దేశాలతో దక్షిణార్థ గోళపు దేశాల మధ్య అంతరాలు విపరీతంగా పెరిగిపోయాయి.

(తరువాయి 24వ పేజిలో)

సమాజంలోని 16 వర్గాల్లో ఎవరెంత శాతం సమాజానికుపయోగపడుతున్నారనడంలో రాజకీయనాయకులు కింది నుండి మూడోస్థానంలో అంటే 14వ స్థానంలో ఉన్నారు. సమాజానికి వారి ఉపయోగం 7.7 శాతం అయితే ఆ తర్వాత 3.6శాతం బ్లాక్ మార్కెటీర్లు, 3.శాతం తార్పుడు గాళ్లు, వరుసగా 15-16 స్థానాల్లో నిలిచారు. 15.9 శాతం సమాజానికి ఉపయోగకరంగా ఉపాధ్యాయులు ఒకటవ స్థానంలో నిలిచారు.

-అవుట్‌లుక్ సర్వే

నక్సలైట్ల సమస్య పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తన మంత్రులతో కలిసి మలేషియా, సింగపూర్ తిరగడం మాని ఒకసారి నాగాలాండ్ వెళ్ళి రావాలి. నక్సల్స్ తుపాకులు వీడితేనే చర్చలు జరుపుతామనడం సమంజసం కాదు. కాల్పుల విరమణ ప్రతిపాదన తొలుత ప్రభుత్వం వైపునుంచే రావాలి.

-కె.బాలగోపాల్ (మానవహక్కుల వేదిక)

రాజకీయ నాయకుల రాజకీయాల నెదుర్కోవడం ఒక సమస్యగా మారింది. వారికి రాజకీయం ఉద్యోగంగా మారింది. ఉత్తమ అభ్యర్థుల ఎన్నికకు ఓటేద్దామనుకునే ప్రజలకు అలాంటి అభ్యర్థులే దొరకడం లేదు.

-లింగ్డో (ఎన్నికల ప్రధానా కమిషనర్)

దేశంలోని 11 బ్రాండ్ల టీ-శాంపిళ్లను విశ్లేషించగా అందులో ఏడింటిలో ఇనుపరజను, తదితర పదార్థాలు అనుమతించిన దానికన్నా కొన్ని రెట్లు అధికంగా ఉన్నాయి. ఇందులో అయిదు శాంపిళ్లలో డ్రికోపాల్ అనే పురుగుమందు అవశేషం అనుమతించిన దానికన్నా అధికంగా ఉంది.

-శివదాస్ బి మీనన్ (భారత పారిశ్రామిక మండళ్ల సమాఖ్య-కేరళ శాఖ ప్రతినిధి)

రాజకీయ నాయకులను మధ్యతరగతి ప్రజలే కాదు, మొత్తం సమాజమే ఏవగించుకుంటుంది.

- చో రామస్వామి (తుగ్లక్ పత్రిక సంపాదకుడు)

మహిళాభివృద్ధికి, వారి హక్కుల పరిరక్షణకు వారు చేపడుతున్న ఉద్యమాలకు పురుషుల సహకారం కూడా అవసరం. అప్పుడే సత్ఫలితాలు సాధించడానికి వీలవుతుంది.

- జీవాపెరుమాళ్ పిళ్లై (ప్రపంచబ్యాంక్ ప్రతినిధి)

పాలస్తీనా భూభాగాల్లో నిర్మిస్తున్న సెక్యూరిటీ గోడను వెంటనే నిలిపివేయాలి చర్చలను ప్రారంభించకపోతే పశ్చిమాసియాలో హింస ఉధృతమయ్యే అవకాశముంది.

- కోఫి అన్నన్ (ఐక్యరాజ్య సమితి ప్రధానకార్యదర్శి)

అమెరికాపై సెప్టెంబర్ దాడులను అడ్డం పెట్టుకుని పశ్చిమదేశాలు యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్నాయి. బుష్ నియంతృత్వపు విధానాలతో ఉగ్రవాదులను తలదన్నే స్థాయిలో భయకంపితులను చేస్తున్నాడు. ....ధనిక దేశాలు వరల్డ్‌బ్యాంక్, ఐ.ఎం.ఎఫ్‌లను, డబ్ల్యు.టి.వోను కూడా ఆ విధంగా మార్చుకునే కుట్రచేస్తున్నాయి.

- మహతీర్ మహమ్మద్ (మలేషియా ప్రధాని)

నేడు ప్రపంచంలో అత్యంత భాగ్యవంతమైన దేశంగా పరిగణింపబడుతున్న అమెరికా అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. అభివృద్ధి రేటు 4శాతం కన్నా తక్కువ ఉండటం, ప్రతీ ఏటా అప్పులు పెరిగి పోవటంతో అమెరికా ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ముంచుకొస్తుంది.

- కెనెత్ రోగోస్ (హార్వర్డ్ యూనివర్సిటి ప్రొఫెసర్)

ఏప్రిల్ నెలలో సద్దాంను గద్దె దింపినప్పటి నుంచి ఇరాక్‌లో ప్రతీవారం కనీసం ముగ్గురు నుంచి ఆరుగురు అమెరికన్లు శత్రువుల దాడికి బలైపోతున్నారు. బాంబు ప్రేలుళ్లతో పాటు అమెరికా సైనికులపై రోజుకు 15 నుంచి 20దాడులు జరుగుతున్నాయి.

- సంకీర్ణదళాల కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ రికార్డో శాంచెజ్

పాకిస్థాన్‌లో పిల్లల హక్కులకు భంగం కలుగుతుంది. జైళ్లలో దాదాపు 4500మంది పిల్లలున్నారు. అందులో 3వేల మంది ఏ శిక్ష లేకుండా మగ్గుతున్నారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా పిల్లలకు మరణశిక్ష విధించడం జరుగుతుంది. ఒక వేళ వారిపై గల ఆరోపణలు రుజువైనా వారు జైలులో గడిపిన కాలంలో ఐదో వంతు కాలం కూడా శిక్ష అనుభవించ వలసి ఉండదు.

- అమ్నెస్టీ ఇంటర్నేషనల్

ఈ ఏడాది చివరికల్లా అమెరికాలోని కాల్‌సెంటర్లలో దాదాపు లక్షా 50 వేల ఉద్యోగాలు బయటి దేశాలకు తరలి పోతున్నాయి. 2008 నాటికి ఈ సంఖ్య 2 లక్షలకు దాటిపోతుంది

-డేటా మోనిటర్ సర్వే

"వెలుగు సర్వేలపై ఫిర్యాదులు" - సి.పి.ఐ.(ఎం)

వెలుగు చీకటిని పారదోలుతుంది. కాని మన ప్రభుత్వం హయాంలో వెలుగు చీకట్లకు దారి తీస్తుంది.

"కాంగ్రెస్ బస్ యాత్ర" - రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు

వచ్చే ఎన్నికల్లో జైత్ర యాత్రకు సన్నాహమా? కాంగ్రెస్‌లో కొట్లాటకు సిగ్నలా ?

"అయిదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు ఆస్తులు, అప్పులు, నేరచరిత్రపై ఒక అఫిడవిట్ దాఖలు చేయాలి" కాంగ్రెస్ నిర్ణయం

భేష్. తెలుగుదేశం ఏ చేస్తుందో చూడాలి.

"నక్సలైట్లకు దమ్ములుంటే ఎన్నికల బరిలోకి వచ్చి తమ సత్తా నిరూపించుకోవాలి" - హోంమంత్రి.

అదిగో మళ్ళీ అదే మాట. ముందు నిషేధం తొలగించి, ఆ తర్వాత సవాల్ విసిరితే బావుంటుంది.

"సంజీవరెడ్డినగర్‌లో రహదారులు అస్తవ్యస్థం" వార్త

ఏ నగర్‌లో, ఏ బస్తీలో బావున్నాయట, ప్రధాన రహదారు తప్ప.

"కోటి వరాలు" వార్త

అంటే కోటి సమస్యలున్నట్లేగా? మరి ఎనిమిది సంవత్సరాల అభివృద్ధి అంతా ఏమైనట్లు ?

"తెలంగాణాకు అన్యాయం చేశారు" తెలంగాణా రాష్ట్ర సమితి

అసలు ఏ ప్రాంతానికి న్యాయం చేశారట? అంతా న్యాయం చేసే వుంటే సానుభూతి పవనాల కోసం ప్రాకులాడడమెందుకు?

"చదువుకోని పిల్లలంతా బాల కార్మికులే" మెగసెసే అవార్డు గ్రహీత శాంతా సిన్హా

బాగా చెప్పావు తల్లీ. అదేదో కాస్త చంద్రబాబు కూడా చెప్పు

"రాష్ట్రంలో వరుసగా రోడ్డు ప్రమాదాలు" వార్తలు

ఎన్ని ప్రమాదాలు జరిగితేనేం, ఎన్నికల్లో ప్రమాదం జరగకుండా చూడు ఏడుకొండలవాడా?

"రైస్ మిల్లర్ల సమ్మె" వార్త

సుప్రీంకోర్టు సమ్మె నిషేధం తీర్పు వ్యాపారస్తులకు వర్తిస్తుందా?

"సర్పంచ్‌లకు మరిన్ని బాధ్యతలు" ప్రభుత్వ ఆదేశం

మరిన్ని నిధులు కూడా సమకూర్చారా ?

"లంచగొండి తనానికి వ్యతిరేకంగా పోరాడడానికి ప్రభుత్వ నిర్ణయం" - మంత్రిమండలి.

అంటే ఇంతవరకూ ఆ పని చేయలేదనేగా ?

"ప్రభుత్వోద్యోగాల కోసం వేచి చూడొద్దు" - ప్రధాని

మరి సంవత్సరానికి కోటి ఉద్యోగాలిస్తానన్నారుగా ?

"అవినీతి వరదకు ఆ "గేటు గల్లంతు" అన్నమయ్య ప్రాజెక్టు వార్త శీర్షిక.

ఎన్నికల్లో తెలుగుదేశం గల్లంతుకు ఇది సూచనా ?

"చిన్న పరిశ్రమలతోనే మరింత ఉపాధి" - మంత్రి బొజ్జల.

28 వేల చిన్న పరిశ్రమలు మూతపడ్డాయని ప్రభుత్వమే చెబుతోంది కదా.

"చిన్న పరిశ్రమలకు అధికారుల వేధింపులుండవు" - మంత్రికోటగిరి

అధికారుల ఈసడింపులు, వేధింపులు మంత్రులకే తప్పటం లేదు. చిన్నపరిశ్రమలేపాటి.

"ఐ.టి. ఎగుమతుల్లో కర్నాటక టాప్"

ముఖ్యమంత్రేమంటున్నారా? కర్నాటక ఎగుమతులు 2.91 బిలియన్ డాలర్లు. ఆంధ్ర నుంచి 0.8 బిలియన్ డాలర్లు !

"రద్దయినా రాజభోగం" కుర్చీ వదలని కాంట్రాక్ట్ లేబర్ సలహా సంఘం ఛైర్మన్

కాంట్రాక్ట్ లేబర్ కదా. ఆయన కాంట్రాక్టు పుచ్చుకొన్నాడేమో. ఎన్నుకొన్న ప్రజలు ఛీకొడుతూంటే మంత్రులు సీట్లు వదిలారా?

ప్రతికూల పవనానికి పునాది ఏమిటి?

- ఎన్.వేణుగోపాల్

విద్యారంగం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి గతంలోని అన్ని ప్రభుత్వాల వైఖరి కంటే దారుణమైనది. 'విద్యావ్యాపారాన్ని అరికడతాం' అని ఎన్.టి.రామారావు అతి తీవ్రంగానూ, గంభీరంగానూ మాట్లాడినప్పటికీ, వాస్తవంగా తెలుగుదేశం ప్రభుత్వ కాలంలోనే విద్యావ్యాపారం బలంగా, స్థిరంగా వ్యవస్థీకృతమైంది. ప్రైవేట్ రంగంలో కొత్తగా అనేక విద్యాలయాల పుట్టుకకు అంగీకరించడంలోనైతేనేమి, సహకార రంగం పేరు మీద గ్రామీణ పెత్తందారీ వర్గాల చేతుల్లో విద్యా వ్యవస్థను పెట్టడంలోనైతేనేమి, కాపిటేషన్ ఫీ, డొనేషన్లు మారుపేరుతో కొనసాగుతుంటే చూసిచూడనట్లు ఉండి పోవడమైతేనేమి, మొత్తం మీద తెలుగుదేశం ప్రభుత్వం విద్యావ్యాపారాన్ని అరికట్టే దిశలో ఏ ఒక్క చర్యనూ చేపట్టలేదు.

మరోవైపు విద్యారంగంలో ఈ వ్యవస్థ గురించి ప్రశ్నలు తలెత్తకుండా ఉండేందుకు గాను విద్యావ్యవస్థలోనూ, విద్యార్థి రంగంలోనూ ప్రజాస్వామిక సాంప్రదాయాలను రద్దు చేసి వేసింది. విద్యార్థి సంఘాల ఎన్నికలు క్రమక్రమంగా కనుమరుగైపోయాయి. విశ్వవిద్యాలయ పాలకవర్గాలకు అంతకుముందే అరకొరగా జరుగుతుండిన ఎన్నికలు పూర్తిగా రద్దయి నామినేషనల్ పద్ధతి మొదలయింది.

రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన అస్తవ్యస్త విధానాల వల్ల రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి, ముఖ్యంగా రాష్ట్రంలో విద్యుదుత్పాదన స్థితి దారుణంగా దెబ్బతింది. విద్యుత్ కోత అంతకు ముందెన్నడూ లేని స్థాయిలో రాష్ట్రాన్ని ముప్పతిప్పలు పెట్టింది. విద్యుత్ కోత వల్ల వ్యవసాయ రంగంలో తక్కువ దిగుబడులు రావడం మాత్రమే కాక, వచ్చిపోయే విద్యుత్తుతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మోటార్లు కాలిపోయి రైతులు చెప్పరాని ఇబ్బందులకు గురయ్యారు. పట్టణ ప్రజానీకం, విద్యార్థులు నానా అగచాట్లు పాలయ్యారు. విద్యుత్తు కొరత వల్ల పారిశ్రామికాభివృద్ధి కుంటుపడటం సహజమే. అంటే రాష్ట్రానికి ఆ మేరకు ఉద్యోగ కల్పనా శక్తిలో కూడా లోటు ఏర్పడింది.

ఇలా అభివృద్ధి కార్యక్రమాల పైన నిధులు కేటాయింపులో సరైన విధానం లేకపోయినందు వల్ల అనేక చిన్న తరహా నీటి పారుదల పథకాలు తీవ్రమైన జాప్యానికి లోనయ్యాయి. అందువల్ల వాటి నిర్మాణ వ్యయం ఎన్నో రెట్లు పెరిగిపోయింది. 'తెలుగుగంగ' నిర్మాణంపై అనవసరమైన వివాదాన్ని రేపడం మాత్రమే కాక, రాయలసీమ ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా ఆ పథకాన్ని రూపొందించడం జరగలేదు.

ఇలా ప్రణాళికా వ్యయం విషయంలో అస్తవ్యవస్థ విధానాలను అవలంభించిన ప్రభుత్వం ప్రణాళికేతర వ్యవయంలో, ముఖ్యంగా ప్రభుత్వ విధానాల ప్రచారం వంటి వాటిపై వ్యయంలో దుబారా చేసిందని ప్రతిపక్ష పార్టీలు ఆ రోజుల్లోనే ఆరోపించాయి.

ఈ స్థితి వల్ల రాష్ట్ర ఖజానా ఖాళీ అయి పోతున్నదనే విమర్శలు కూడా వచ్చాయి. రాష్ట్రం ఆర్థికంగా చితికిపోయిందో లేదోగాని, అనేక సందర్భాలలో ప్రభుత్వం బిల్లుల చెల్లింపులలో జాప్యం చేసిన మాట మాత్రం నిజం అంతేగాక ఖాళీ అయిన వేలాది ఉద్యోగాలను మళ్ళీ భర్తీ చేయకుండా ప్రభుత్వం అపివేసింది. స్థానిక స్వపరిపాలన సంస్థలకు నిధుల మంజూరులో ఆలస్యం, ఎగవేతలు కొనసాగి చివరికి హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రజాప్రతినిధులు తమకు న్యాయంగా రావలసిన నిధుల కోసం ఆందోళనకు పూనుకోవలసి వచ్చింది.

తెలుగుదేశం ప్రభుత్వ పాలనను, ఎంతగా సమర్థించదలచిన వారయినా అంగీకరించే ఆరోపణలు రెండు ఉంటాయి. అవి ఒకటి అవినీతి, రెండు ఆశ్రిత పక్షపాతం.

స్వచ్ఛమైన పాలనను సమకూరుస్తానని అనేక పర్యాయాలు ప్రకటించిన ముఖ్యమంత్రి ఆస్తుల గురించి, పన్నుల ఎగవేత గురించి, పట్టణ భూముల గరిష్ట పరిమితి చట్టం ఉల్లంఘనల గురించి ఎన్నో అవినీతి ఆరోపణలు వచ్చాయో, రామారావు ప్రభుత్వంపైన కూడా అన్ని అవినీతి ఆరోపణలు వచ్చాయి.

ఎన్.టి.రామారావును తెలుగుజాతి ప్రతినిధిగా, తెలుగుదేశం పార్టీని తెలుగువాడి ఆత్మాభిమాన పరిరక్షకురాలిగా భావించిన ప్రజలు, కొద్దికాలంలోనే ఆయన, ఆ పార్టీ ఒక వర్గానికి మేలు చేసేందుకే అధికారంలోకి వచ్చిందేమోనని అనుమానించడం ప్రారంభించారు. నిజానికి ఆయన ఏ వర్గానికి ప్రయోజనం చేకూరుస్తున్నారనే ఆరోపణ వచ్చిందో ఆ వర్గంలో పేదవారికి ఆయన చేసిందేమీ లేదు. అయితే కృష్ణా, గుంటూరు జిల్లాలలో రక్షిత నీటి పారుదల, ఎరువులు, హరిత విప్లవం వంటి పరిణామాల ఫలితంగా తలెత్తుతూ వచ్చిన ఒక వర్గం రాష్ట్ర అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు ఎన్.టి.రామారావును ప్రతినిధిగా ముందుకు తెచ్చిందని ఒక వాదన ఉంది. ఈ వర్గాన్ని తరచుగా ఒక అగ్రవర్ణంతో సమానం చేయడం కద్దు. కాని ఆ అగ్రవర్ణ అభిజాత్యాన్ని

పెంపొందించడం మినహా తెలుగుదేశం ప్రభుత్వం కూడా వారికి చేసిన మేలేమీ లేదు. కాని, భౌతిక ప్రయోజనాల కన్నా ఈ భావజాల ప్రయోజనాలే పైచేయి సాధించి ఆ వర్గమూ ఆయనను తమ వాడిగా భావించింది. ఆయన కూడా తాను ఆ వర్గ ప్రతినిధిననే అనుకున్నారు.

ఈ పరిణామం సహజంగానే రాష్ట్రంలో కులతత్వం పెరగడానికి దారితీసింది. రాష్ట్ర రాజకీయాలలో ఆదినుంచి కూడా కుల ప్రభావం ఉంటూనే ఉంది. ముఖ్యంగా ఎన్నికల రాజకీయాలలో కులం తన ఆధిపత్యాన్ని చూపుతూనే ఉంది. కాని సమాజ జీవనంలో కుల విద్వేషం, కులాల మధ్య హంతక ఘర్షణలు పెరగడంతో మాత్రం తెలుగుదేశం ప్రభుత్వానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాత్ర ఉంది.

తొలిసారి తెలుగుదేశం ప్రభుత్వం విజయం సాధించిన సమయంలోనే పదిరికుప్పంలో హరిజనుల మీద అగ్రవర్ణ భూస్వాములు దాడి చేశారు. ఆ తర్వాత ప్రకాశం జిల్లాలో కారంచేడు, గుంటూరు జిల్లా నీరుకొండలలో జరిగిన దాడులలో తెలుగుదేశం పార్టీకి చెందిన వారు పాల్గొన్నారని ఆరోపణలు వచ్చాయి. వీటిలో కారంచేడు స్వయంగా ఎన్.టి.రామారావు వియ్యంకుని గ్రామం కాగా నీరుకొండ తెలుగుదేశం ప్రభుత్వంలోని ఒక మంత్రి స్వగ్రామం.

అప్పటి విజయవాడ శాసనసభ్యుడు వంగవీటి మోహనరంగారావుకు, కంకిపాడు శాసనసభ్యుడు దేవినేని రాజశేఖర్‌కు మధ్య ఉన్న ముఠా తగాదాలు 'రాజకీయ రంగు అద్దుకుని కాంగ్రెస్ (ఐ), తెలుగుదేశం పార్టీల మధ్య ఘర్షణగా మారాయి. అంతటితో కూడా ఆగిపోకుండా ఆ ఘర్షణ కులం రంగును కూడా పులుముకొని కాపు, కమ్మ కులాల మధ్య ఘర్షణగా మారింది. దీనితో రాష్ట్ర రాజకీయాలలో బహిరంగంగా కులతత్వం వ్యక్తం కావడం మొదలైంది. కాపునాడు పేరుతో తెలుగుదేశం వ్యతిరేక సభలు జరిగాయి. ○

(20వ పేజీ తరువాయి)

సామ్రాజ్యవాద సారంశం దోపిడీయె

1400ప్రాంతంలో కూడా ప్రజల మధ్య అంతరాలు ఉండేవి. కాని ఒక దేశంలో ప్రజల జీవనంలోని మౌళిక స్థితిగతులు దాదాపు ఒకే స్థాయిలో ఉండేవి.-రాజులు ఉండే వాళ్లు. అనేక రకాల యజమానులు ఉండేవాళ్లు కాని పంటల మీదనే చాలా ఆధారపడి ఉండేది. పండకపోతే తిండి దొరికేది కాదు. కాని ఆర్థికవ్యవస్థలు ఏకం కావడంతో పరిశ్రమలను అభివృద్ధి చెందించడానికి నియంత్రణలు విధించడంతో ప్రజానీకంలో కొందరు జీవించే పద్ధతికి మరెందరో జీవించే పద్ధతికి చెప్పుకోదగిన అంతరాలు ఏర్పడ్డాయి. 500సంవత్సరాలుగా పరిస్థితులు ఈ దిశలో సాగుతున్నాయి. సంపదలో అత్యధిక భాగం జనాభా 10, 20శాతం మంది చేతుల్లో ఉండగా 80, 90శాతం మంది ఆ మిగిలిపోయిన దానిమీద జీవిస్తున్నారు. ఇది కేవలం యాదృచ్ఛికం.

దేశం లోపల దేశాల మధ్య ఉన్న ఈ అంతరమే సామ్రాజ్యవాదానికి మూలధాతువు. పెట్టుబడిదారి విధానపు మొత్తం వ్యవస్థలో సామ్రాజ్యవాదంలో అది ఒక భాగం. సామ్రాజ్యవాదం పుట్టిననాటి నుంచి ఇది ఉంది. ఇంకా ఇంకా దిగజారుతుంది. ప్రపంచ జనాభాలో 20శాతం మంది అతిపేద 50దేశాల్లో నివసిస్తున్నారు. ప్రపంచ ఆదాయంలో వారు పొందుతున్న వాటా 20శాతం మాత్రమే.

అంతేకాదు అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా సంపద విపరీతంగా పోగుపడుతున్న కొద్ది ధనికుల మధ్య పేదల మధ్య అంతరం నానాటికి పెరిగిపోతూ పెరిగిపోతూ వుంది. పెట్టుబడి దారి విధానపు పరిణామంలో అది అనివార్యం. అంతరాలు సృష్టించడం ద్వారా మాత్రమే పెట్టుబడిదారి విధానం పని చేస్తుంది. ఒక పరిశ్రమాధిపతి కోట్ల డాలర్లు సంపాదిస్తుండగా, ప్రజానీకంలోని ఎంతోమంది దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతుంటారు. పిల్లలకు తినడానికి తిండి ఉండదు. వైద్య సౌకర్యాలుండవు. సరైన చదువుండదు. ఇదంతా ప్రపంచంలోకెల్లా అతి సంపన్నమైన దేశంలో జరుగుతుంది. మనం ఇంకా ఇంకా సంపన్నులం అవుతూ వుంటాం. మనలో ఒక భాగం ఇంకా ఇంకా పేదరికంలో పడి పోతుంది. పరిస్థితి ఎంత దిగజారిందంటే అమెరికాలో ఇవాళ అతి సంపన్నమైన 13 వేల కుటుంబాలు సంపాదించేది అట్టడుగున వున్న రెండు కోట్ల కుటుంబాలు సంపాదించే దాని కన్నా ఎక్కువ.

(పూర్తి పాఠం కోసం ఎనలిటికల్ మంత్లీ రివ్యూ సెప్టెంబర్ 2003 సంచిక చూడండి)

వీక్షణం చందాదారులు కాగోరువారు 'సమతా పబ్లికేషన్స్' పేర రూ.120/-లను డి.డి.గా కింది అడ్రసుకు పంపించగలరు.

వి.హనుమంతరావు, ఇం.నెం. 8-3-898/22, రోడ్ నెం. 3, నాగార్జుననగర్, హైదరాబాద్ - 500 073.

Owned, Printed and Published by **V.Hanumantha Rao** at D.No. 8-3-898/22, Road No. 3, Nagarjuna Nagar, Hyderabad-500 073. Ph: 23748672
Designed & Printed at: Nutan Art Printers, Lakdi-ka-pool, Hyderabad. **Editor** : V.Hanumantha Rao